సంపుటి : 18
సంచిక : 187
Vol : 18
Issue : 187

RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, మంగళవారం 22 సెప్టెంబర్ 2026
Warangal, Tuesday 22 September 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00

www.epaper.peoplesdairynews.com
www.peoplesdairynews.com

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, Nizamabad & TG All Districts



WANTED
పీపుల్స్ డైరీ
దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సెంటర్లు
- హనుమకొండ
- కరీంనగర్
- భూపాలపల్లి
- పెద్దపల్లి/రామగుండం
- జనగామ
- మహబూబాబాద్
- హైదరాబాద్
- నిజామాబాద్

Cell : 9493019044
9618509859


# అన్నదమ్ముల భూదాహం?




సరిహద్దుల్లో దేశం కోసం శ్రమించిన భుజాలు ఒకవైపు... బాలల భవితకు బాటలు వేయాల్సిన గురువు చేతులు మరోవైపు... కానీ అవే చేతులు సామాన్యుడి భూమిని అక్రమంగా పెకిలిస్తే న్యాయం ఎక్కడ నిలవాలి..?

ఆ సైనికుడికి సర్కారు ఇచ్చిన ఐదెకరాల నేల చాలదా..? పక్కనున్న పేదల పొలంపైనే ఎందుకు ఈ కబ్జా కన్ను..? ఇదో అన్నదమ్ముల భూ కబ్జా కథ వంశపారంపర్యమని ఒకరు కహానీ... పాత ఇంటి నంబరంటూ మరొకరి కథ... కాగితాల చాటున కబ్జాలకు కొత్త రంగులు పూస్తే సామాన్యుడి కన్నీటికి సాక్ష్యం ఎవరు..? పిల్లలకు నీతులు చెప్పే గురువు చేతుల్లోనే పేదవాడి ఇంటి స్థలం చిక్కితే... సమాజానికి నీతి చెప్పే పెద్దల నోళ్లే కబ్జాదారుల వంతపాడితే... న్యాయం ఎక్కడికి వెళ్లాలి..? భూమి కోసం పోరాడే బాధితుల గొంతు చిన్నదైనా... ఆ గొంతులోని ఆవేదన ఆకాశాన్నైనా తాకుతుంది... న్యాయ దేవత ఎప్పుడైనా బాధితుల తలుపు తట్టుతుంది...

2వ పేజీలో..

- సరిహద్దుల్లో దేశ రక్షణ చేసిన వారు ఒకరు!
- భవిష్యత్తును తీర్చిదిద్దే ప్రభుత్వ ఉపాధ్యాయుడు మరొకరు!

- భూకబ్జాదారుల ద్విపాత్రాభినయం?
- సామాన్యులపై భూకబ్జాలు?
- అక్రమార్కులకు గ్రామపెద్దల వత్తాసు...
- కబ్జాలకు మెండుగా అధికారుల సహకారం?
- ఇక వారి ఆగడాలకు అడ్డుఅదుపు లేదుగా...

## రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ కబ్జా భాగోతం!

2వ పేజీలో..

భూపాలపల్లి జిల్లా గణపురం మండలం గాంధీనగర్‌లో సాగుతున్న ఈ అన్నదమ్ములు చేస్తున్న కబ్జా వ్యవహారంలో మొదటి పార్ట్‌లో రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ ఎలాంటి నాటకీయ పరిణామంలో బాధితుల భూమి కొల్లగొడుతున్నాడో తెలుసుకుందాం. పార్ట్ 2లో ఇతడి సోదరుడైన ప్రభుత్వ ఉపాధ్యాయుడి అక్రమ వ్యవహారంపై 'పీపుల్స్‌డైరీ' మరో ప్రత్యేక కథనం వచ్చే సంచికలో.....

పార్ట్-1




సర్కార్ ఇచ్చిన భూమి చాలదా? ఇంకా ఎందుకీ అత్యాశ

పహానీ మార్చి.. వారసత్వం అంటూ కథలు షురూ...

- ఒక్కో చోట ఒక్కో సర్వే నెంబర్ మతులబేమిటి?
- రెవెన్యూ అధికారుల తీరుపైనా అనుమానాలు!
- దళిత మహిళ భూమికి దిక్కెవరు?
- పహానీ సాక్షిగా అనేక ప్రశ్నలు!





10లో

## టార్గెట్ కడియం...

- నెక్స్ట్ స్టెప్‌పై కేసీఆర్ అలర్ట్
- పార్టీ మారిన వారిపై వెనక్కి తగ్గొద్దని డిసైడ్
- దానంపై వేటుతో గులాబీలో ధీమా....

## అన్నదాతల ఆర్తనాదం

ఒకవైపు ప్రకృతి పగ... మరోవైపు కరెంటు కోతలు

- నిత్యం ప్రతిపక్షాలను నిందిస్తూ ప్రెస్‌మీట్లు
- సమస్యలను గాలికి వదిలి పాలకుల నిర్లక్ష్యం
- నిరసనలు వ్యక్తంచేస్తున్న రైతన్నలు
- సొంత పార్టీ నేతలే స్తంభం ఎక్కి ఆందోళన...

# సర్కార్ అనవసర రాజకీయాలు

10లో



## ట్యాంక్‌బండ్‌పై ఉద్రిక్తత..

- నిమజ్జనాలపై నిషేధం తొలగించాలని డిమాండ్లు
- భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నిరసన

2లో



## వరంగల్ ఎయిర్‌పోర్ట్ పేరు కోసం ప్రజలు, మేధావుల సూచనలు

- 'కాకతీయ'కు సైతం మద్దతు
- చరిత్ర ప్రతిబింబించాలంటూ మెజార్టీ ప్రజల అభిప్రాయం
- విమానాశ్రయం పేరుపై సోషల్ మీడియాలో చర్చ

# రుద్రమవైపే మొగ్గు..

10వ పేజీలో..




## దానం వ్యవహారంలో ఉత్కంఠ

### రేపు విచారణ చేపట్టనున్న సుప్రీం...

పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ : దానం నాగేందర్ అనర్హత వ్యవహారం మరో కీలక మలుపు తిరిగింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు బుధవారం రోజున విచారణ చేపట్టనుంది. ఈ మేరకు దానం నాగేందర్ తరపు న్యాయవాది సీనియర్ అడ్వొకేట్ ముకుల్ రోహత్గి పిటిషన్‌ను సుప్రీం కోర్టులో మెన్షన్ చేశారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు బుధవారం రోజున విచారణ జరపనుంది. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరపున ఖైరతాబాద్ (మిగతా 2లో...)

# కమిషనర్ గారు చర్యలేవి?

- రోడ్డు ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై దృష్టిసారించరా..?
- నోటీసులు అందించామంటున్న అధికారులు
- గత ఏడాది నోటీసు అందించినప్పటికీ చర్యలు శూన్యం
- రోడ్డు ఆక్రమించినా ప్రశ్నించే వారే లేరు...
- షెడ్డునిర్మాణం, కమర్షియల్ కట్టడాలకు అడ్డుకట్ట వేసేదెవరు?
- యజమానులతో కుమ్మక్కవుతున్న బల్దియా సిబ్బంది!
- బహుళ అంతస్తులపై దృష్టి సారించని టౌన్ ప్లానింగ్ అధికారులు
- ప్రజావాణిలో ఫిర్యాదులందినప్పటికీ నిర్లక్ష్యం

2లో







# అన్నదమ్ముల భూదాహం!

- సరిహద్దుల్లో దేశ రక్షణ చేసిన వారు ఒకరు!
- భవిష్యత్తును తీర్చిదిద్దే ప్రభుత్వ ఉపాధ్యాయుడు మరొకరు!
- భూకబ్జాదారుల ద్విపాత్రాభినయం?
- సామాన్యులపై భూకబ్జాలు?
- అక్రమార్కులకు గ్రామపెద్దల వత్తాసు...
- కబ్జాలకు మెండుగా అధికారుల సహకారం?
- ఇక వారి ఆగడాలకు అడ్డుఅదుపు లేదుగా...

**నిఘా టీం ( పీపుల్స్ డైరీ) (గణపురం) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం గాంధీనగర్ గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగం చేసే రిటైర్ అయి ఉన్న ఒక ఆర్మీ ఆఫీసర్, ప్రస్తుతం ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న ఒక ఉపాధ్యాయుడు ఇద్దరు వ్యక్తులు తమ భూములను కాజేస్తున్నారని బాధితులు వాపోతున్నారు.


సరిహద్దులో దేశాన్ని కాపాడి రిటైర్ కావడంతో ఎక్స్ సర్వీస్ మెన్ కింద ప్రభుత్వం దగ్గర నుండి ఎంతో విలువైన ఐదు ఎకరాల భూమిని పొంది అది చాలదన్నట్టు పక్కన ఉన్న దళిత మహిళా భూమిని కాజేసిన రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ ఒకరైతే... భవిష్యత్తును తీర్చి దిద్దే ఎంతో విలువైన ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తిలో మరొకరు ఉంటూ పిల్లలకు నీతులు చెప్పాల్సిన ఉపాధ్యాయుడే తన తెలివితేటలతో ఒక సామాన్యుని ఇంటి స్థలం హస్తగతం చేసుకున్న తీరు చూస్తుంటే ఆ ఇద్దరి అన్నదమ్ముల అక్రమ 'గారడి ఆ గ్రామంలో నిలువెత్తు సాక్ష్యంగా నిలిచింది. ఒక సర్వే నంబర్‌తో వేర్వేరు చోట్ల, వేరు వేరు శాఖల అధికారుల దగ్గర, వేర్వేరు కొలతలతో అధికారుల కళ్ళు గప్పి ఒక దళిత మహిళ రైతు భూమిని కబ్జా చేస్తున్న మాయాజాలం ఒకరిది అయితే, మరొకరు తమ తాతగారి పాత ఇంటి నంబర్‌ను వాడుకుని, దొంగ పర్మిషన్‌తో సామాన్యుడి వేదనను తొక్కేసి ఇంటి స్థలాన్ని మరొకరు కబ్జా చేశారు. వంశపారంపర్య భూమి అంటూ ఒకరు నాటకం. మరొకరు ఏళ్లకు ఏళ్లుగా వేరొకరి పేరు మీద ఉన్న సర్వే నంబర్‌ను తమ వంశపారంపర్య భూమి అని బుకాయిస్తూ ఆక్రమణకు పాల్పడ్డారు. ఇంత అన్యాయం జరుగుతున్న గ్రామంలోని కొందరు పెద్దలు ఈ అన్యాయం అడ్డుకట్ట వేయకపోగా ఆక్రమణదారులకి సలహాలు సూచనలు ఇస్తూ వారి ఆక్రమణలో పాలుపంచుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ గ్రామంలోని కొందరు పెద్దలు ఆ ఊరిని సైతం మేమే రూపొందించామని చెప్పుకుంటూ ఆక్కడ ఏ సమస్యలు జరిగిన అందులో తలదూర్చుతూ భూ సమస్యలను మరింత జటిలం చేస్తున్నారని ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. గ్రామ పెద్దమనుషుల చెలామని అవుతున్న వారు సామాన్యుల భూములను ఆక్రమించుకుంటున్న ఈ ఇరువురి పెద్దమనుషులు కూడా ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడం వలన వీరి కబ్జాలకు మరింత బలం చేకూర్చింది అని ఆ గ్రామంలో చర్చ బాగానే వినిపిస్తుంది.

# రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ కబ్జా భాగోతం!

- సర్కార్ ఇచ్చిన భూమి చాలదా? ఇంకా ఎందుకీ అత్యాశ
- పహానీ మార్చి.. వారసత్వం అంటూ కథలు షురూ...
- ఒక్కో చోట ఒక్కో సర్వే నెంబర్ మతులబేమిటి?
- పహానీ సాక్షిగా అనేక ప్రశ్నలు!
- రెవెన్యూ అధికారుల తీరుపైనా అనుమానాలు!
- దళిత మహిళ భూమికి దిక్కెవరు?

**నిఘా టీం (పీపుల్స్ డైరీ) (గణపురం)**

రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ తను గవర్నమెంట్ నుంచి పొందిన 5 ఎకరాల భూమి కాకుండా పక్కనే ఉన్న దళిత మహిళ భూమి పై కన్ను పడి దానిని ఎలాగైనా కాజయాలని కుట్ర పన్నాడు కుట్రలో భాగంగా సర్వేనెంబర్ (204 /1/ 2) గల భూమి గత (1977-2017 )వరకు ఇన్ని సంవత్సరాలుగా పహానిలలో ఉన్న పైడిపల్లి ఎర్రయ్య అనే వ్యక్తి పై ఉన్న పేరును తొలగించి తన తండ్రి పేరు మీదకి మార్చడం జరిగింది. ఈ ఆధారాన్ని పట్టుకొని అటు రెవెన్యూ అధికారులను హ్యూమన్ రైట్స్ అధికారులను గ్రామపంచాయతీ పెద్దలను తప్పుదోవ పట్టిస్తున్నారు. 2021 లో హ్యూమన్ రైట్స్ కమిషన్ లో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుకి సమాధానంగా రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ తన తండ్రి మీద ఒక ఎకరం భూమి ఉన్నట్టుగా (201/1/2/2) సర్వే నెంబర్ లో తనపై 5 ఎకరాల భూమి ఉన్నట్టుగా, పోలీస్ స్టేషన్ లో తన భూమిని దళిత మహిళ ఆక్రమించుకుం టుందని ఇచ్చిన ఫిర్యాదులో (204/1/2) సర్వే నెంబర్ లో వారసత్వ భూమి ఎకరం 17 గుంటలు అని లిఖితపూర్వకంగా ఆధారాలు ఇవ్వడం జరిగింది. అంతేకాకుండా తన తండ్రిపై మార్చబడిన పహానినీ చెక్ చేయగా సర్వేనెంబర్ (204/1/2) లో 30 కుంటల భూమిగా నమోదు అయింది. అలాంటప్పుడు ఈ సర్వే నెంబర్ తో తనకు వారసత్వంగా వచ్చిన భూమి అని చెప్పుకొస్తున్న సదరు రిటైర్ ఆర్మీ ఆఫీసర్ తన భూమి అని చెప్పుకు వస్తున్న సర్వేనెంబర్ (204 /1/2)కి గల పహాని లలో వేరే వాళ్ళ పేరు ఎలా వచ్చింది అని కొందరు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ చెప్పుకొస్తున్న ఈ కహానిని రెవెన్యూ అధికారులు ఎలా ఆమోదించారు అని మండిపడుతున్నారు. ఇది ఇలా ఉండగా కబ్జాకు పాల్పడుతున్న బాధితురాలి భూమి సర్వేనెంబర్ (204/1/6 )లోగల ఎకరం 20 గుంటల భూమికి గల విస్తీర్ణానికి ఏమిసంబంధం, ఆ సర్వే నెంబర్ కి ఏమి సంబంధమని బాధితురాలు,ఈ విషయం గుర్తించిన కొందరు గ్రామస్తులు, ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అసలు సంబంధమే లేని దళిత మహిళ భూమి పై రెవెన్యూ అధికారులను తప్పుదోవ పట్టించి తనకు న్యాయబద్ధంగా తన తండ్రి దగ్గర నుండి వచ్చిన వారసత్వ భూమిని దక్కకుండా చేశాడు అని తన డబ్బు బలంతో తనకున్న కొందరి అధికారుల అండ దండలతో పాస్ పుస్తకాన్ని బ్లాక్ చేయించడమే కాకుండా ప్రభుత్వం నుంచి తనకు రావలసిన రైతు బంధు కూడా నిర్లక్షణంగా నిలిపివేయడం ఎంతవరకు సమంజసం అని బాధితురాలు వాపోతోంది. అంతేకాకుండా రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ ప్రభుత్వం నుంచి పొందిన తన 5 ఎకరాల భూమి చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూమిని కూడా కొంతమేర తన భూమిలో కలుపుకొని ఆక్రమణకు గురి చేసాడని కూడా గ్రామంలో చర్చ నడుస్తుంది. గ్రామం అభివృద్ధికి గవర్నమెంట్ ఆఫీసులు కట్టడానికి స్థలం వెతుకులాడుతున్న రెవెన్యూ అధికారులు ప్రభుత్వ మిషన్ భగీరథ ఆఫీసుకు ఆనుకొని ఉన్న కనీసం సాగులో లేని ప్రభుత్వభూమి పడి ఉండటం, గ్రామ ప్రయోజనాలకు అభివృద్ధి పనులకు పనికి రాకపోవడం, ఇంత ఉపయోగకరమైన భూమి ఆ రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ కి అధికారులు కట్టబెట్టడంపై సర్వత్ర గ్రామంలో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అసలు జీవనోపాధి కోసం ఇంత విలువైన కమర్షియల్ భూమిని ఇవ్వడమే కాకుండా ఒకవేళ ఇచ్చిన కూడా మూడు సంవత్సరాలు సాగు చేయకపోతే అలాంటి వారిపై చర్యలు తీసుకుని ప్రభుత్వానికి ఉపయోగపడే విలువైన భూములను రికవరీ చేసుకునే ప్రభుత్వ అధికారులు ఎన్ని సంవత్సరాలుగా పడావుగా ఉన్న ఆ భూమిపై ఆ రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ పై ప్రభుత్వ అధికారుల కు అంత మక్కువ ఏంటి అని కూడా సర్వత్ర గ్రామంలో చర్చ సాగుతోంది. ఇప్పటికైనా అటు రాజకీయ నాయకులు ఇటు రెవెన్యూ అధికారులు తనకిచ్చిన ఐదేకరాల భూమిపై సర్వే నిర్వహించి ఖచ్చితమైన హద్దులు నిర్ణయించి విలువైన ప్రభుత్వ భూమి అన్యక్రాంతం కాకుండా కాపాడాలని గ్రామస్తులు గ్రామ అభివృద్ధి కోరుకునే పెద్దలు కోరుతున్నారు. అదేవిధంగా వారసత్వంగా వస్తున్న ఆ దళిత మహిళ భూమిపై కూడా విచారణ జరిపి సదరు రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ తన వారసత్వ భూమి అని చెప్పుకొస్తున్న సర్వేనెంబర్ (204/1/2 ) పహానిలలో ఉన్నటువంటి పైడిపల్లి ఎర్రయ్య అనే వ్యక్తి కుటుంబానికి తనకు ఏ విధంగా వారసత్వ భూమి అవుతుందని అధికారులు విచారణ జరిపి బాధితురానికి న్యాయం చేయడమే కాకుండా అన్యక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూమి ఆరోపణలపై కూడా పూర్తి విచారణ జరిపి ప్రభుత్వ ఆస్తిని కాపాడాలని గ్రామస్తులు కొందరు గ్రామ పెద్దలు కోరుకుంటున్నారు.


GOVERNMENT OF TELANGANA
REVENUE DEPARTMENT
Ref. No. B/437/2021
Office of the Tahsildar Ghanpur mandal. Date: .12.2024
24 DEC 2021
1). The land in Sy.No.204 situated at Mylaram Village & Government Parampog land to an extent of Ac. 571.22 Gts.
2). Most of the land in the said Sy.No.is covered by hillocks/rocks and some portion of the land has been assigned for agriculture purpose and also for various Government institutions etc.
3). Likewise, an extent of 1-00 ac. of land was assigned for agriculture purpose in favour Boddu Rajaiah and his name was recorded as pattedar of the land in the pahanies/revenue records from the year 1977-78 onwards.
4). Thereafter, an extent of 5-00 ac. of land was assigned in favour of Boddu Ravikumar S/o Rajaiah under Ex-serviceman category.
TAHSILDAR
GHANPUR (M) MANDAL
Scanned with CamScanner


హ్యూమన్ రైట్స్ కమిషన్ కి బాధితురాలి ఫిర్యాదు కి రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ ఇచ్చిన సమాధానంలో వ్యత్యాసం





బాధితురాలి సర్వే నంబర్ 204/1/6 దాని విస్తీర్ణం 1ఎకరం 20 గుంటలు


Pattadar Details
District: Jayashankar Bhupalpalli
Mandal: Ghanapur Mulug
Village: Mylaram
Land Details
Market value of Survey no.(in INR): 450000.00
Transaction Status: Survey no / Sub-division is marked as Assigned Lands
Disclaimer - The information provided online is updated, and no physical visit is required.
Click here for CERSAI for Asset Based Search.
Note : Records are updated as on - 10-09-2026

రిటైర్ ఆర్మీ ఆఫీసర్ తండ్రి పై నమోదైన సర్వేనెంబర్ 204/1/2 దాని విస్తీర్ణం 30 గుంటలు.




# కమిషనర్ గారూ చర్యలేవి?




- రోడ్డు ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై దృష్టిసారించరా..?
- నోటీసులు అందించామంటున్న అధికారులు
- గత ఏడాది నోటీసు అందించినప్పటికీ చర్యలు శూన్యం
- రోడ్డు ఆక్రమించినా ప్రశ్నించే వారే లేరు...
- షెడ్డునిర్మాణం, కమర్షియల్ కట్టడాలకు అడ్డుకట్ట వేసేదెవరు?
- యజమానులతో కుమ్మక్కవుతున్న బల్దియా సిబ్బంది!
- బహుళ అంతస్తులపై దృష్టి సారించని టౌన్ ప్లానింగ్ అధికారులు
- ప్రజావాణిలో ఫిర్యాదులందినప్పటికీ నిర్లక్ష్యం

**పీపుల్స్‌డైరీ ప్రతినిధి, వరంగల్**


గ్రేటర్ వరంగల్ మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలకు అధికారులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. వరంగల్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతులు లేకుండా బహుళ అంతస్తులు, రోడ్లు ఆక్రమించిన కమర్షియల్ భవనాలు, నాలా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు నడుపుతూ పార్కింగ్‌లకు ఉపయోగిస్తున్న యజమానులు... ఇలా చెప్పుకుంటూ పెద్ద మొత్తంలో రోడ్లు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోకుండా చిన్నాచితకా ఇళ్లు నిర్మించుకుంటున్న సామాన్యులపై ప్రతాపం చూపుతున్నట్టు తెలిసింది. అండర్ రైల్వేగేటు ప్రాంతంలో పెరకవాడ, కరీమాబాద్, కాశీకుంట, 60 ఫీట్ల రోడ్డు, ఖమ్మం ప్రధాన రహదారి ప్రాంతాల్లో రోడ్లు ఆక్రమించి బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారు. కాశీకుంటలో ఏకంగా రోడ్డు పైనే షెడ్డు నిర్మాణం, పెరుకవాడలో చిన్న గల్లిలో రెండు ఫీట్లు రోడ్డు ఆక్రమించి బహుళ అంతస్తు నిర్మాణం, ఇక కాశీకుంట ప్రాంతంలో నాలాపై ర్యాంప్ ఏర్పాటు చేసి వ్యాపారాలు కొనసాగిస్తూ పార్కింగ్‌లకు ఉపయోగిస్తున్నారు. ఇవన్నీ కంటికి కనిపిస్తున్నా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ అధికారులు మాత్రం కళ్లకు గంతలు కట్టుకున్నట్టు వ్యవహరిస్తున్న తీరుపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సామాన్యుడు ఇల్లు నిర్మిస్తున్నాడని తెలిస్తే చాలు కింది స్థాయి సిబ్బంది అక్కడ వాలి పోవాల్సిందే. ఇంకేముంది అధికారుల బెదిరింపులు వినకుంటే కూల్చివేస్తామని బెదిరిస్తూ సొమ్ము చేసుకోవడం వారి విజ్ఞతకే వదిలేస్తుంది సమాజం.

**నోటీసులు అందించి చేతులు దులుపుకున్నారా...?**

రోడ్లు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న వారికి నోటీసులు అందించామంటూనే నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నట్టు తెల్సింది. ఏకంగా కూల్చివేతకు నోటీసులు ఇచ్చామంటూ నిర్మిస్తున్న ఇంటి దగ్గరే తిష్ట వేస్తున్నారంటే తెలుస్తుంది ఎంతవరకు చర్యలు తీసుకుంటున్నారా అనేది. కాశీకుంట ప్రాంతంలో ఏకంగా రోడ్డుపైనే షెడ్డు నిర్మించడంటూ గత సంవత్సర కాలంలో ప్రజావాణి ఫిర్యాదు పై నోటీసులు ఇచ్చిన అధికారులు ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదంటే పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పెరకవాడలో చిన్న గల్లిలో రెండు ఫీట్లు రోడ్డు ఆక్రమించి బహుళ అంతస్తు నిర్మిస్తున్నారని అధికారులకు పిర్యాదు చేసినప్పటికీ స్పందన లేదు. ఇక కాశీకుంట ప్రాంతంలో అధికారులు నాలా పరిశీలిస్తే నాలాపై ఎటువంటి నిర్మాణాలు చేపట్టారు అనేది కంటికి కానవస్తుంది. మరి అధికారులు దృష్టి సారించట్లేదా లేక మరో మతలబేమైన ఉందా అంటున్నారు ప్రజలు.

**బల్దియా కమిషనర్ స్పందించేనా..?**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణా లోపమా లేక బిల్డింగ్ యజమానులు బిల్డర్‌లతో కుమ్మక్కై అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారా అని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. క్షేత్ర స్థాయిలో కమిషనర్ దృష్టి సారిస్తే తప్ప టౌన్ ప్లానింగ్ అధికారుల భాగోతాలు బయటపడే అవకాశముందని తెలుస్తుంది. అక్రమ అనుమతులకు లక్షల రూపాయలు దోచేస్తూ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ ఖజానాకు చిల్లు పెడుతున్నారని బాహాటంగానే ప్రచారం సాగుతుంది . ఏకంగా నోటీసులు అందించామంటూనే చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్న సంబంధిత అధికారుల పై చర్యలు తీసుకుంటూ ప్రజావాణి పిర్యాదులు పరీక్షించి సమస్యలు పరిష్కారం చేస్తూ ఆక్రమణలకు పాల్పడి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్న వాటిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.











# ట్యాంక్‌బండ్‌పై తీవ్ర ఉద్రిక్తత....

- నిమజ్జనాలపై నిషేధం తొలగించాలని డిమాండ్లు
- భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నిరసన

**పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ :** గణేష్ నిమజ్జనాల విషయంలో హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హుస్సేన్‌సాగర్‌లోని ట్యాంక్‌బండ్ వైపు వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు అనుమతి లేదంటూ జీహెచ్ఎంసీ అధికారులు ఫ్లెక్సీలు, బారికేడ్లు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. వినాయక నిమజ్జనానికి అనుమతి ఇవ్వాలంటూ సోమవారం ట్యాంక్‌బండ్ వద్ద భాగ్యనగర్ ఉత్సవ సమితి ప్రతినిధులు ఆందోళనకు దిగారు. దీంతో వారిని పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది.



నిమజ్జనాలపై ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ భాగ్యనగర్ ఉత్సవ సమితి ప్రతినిధులు ట్యాంక్‌బండ్ పరిసరాల్లో బైఠాయించారు. ఈ క్రమంలో అక్కడ ఏర్పాటు చేసిన కొన్ని బారికేడ్లను వారు తొలగించారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. తోపులాటలో కొందరు పోలీసులు కిందపడినట్లు ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. దీంతో పోలీసులు అదనపు బలగాలను మోహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు.

మరోవైపు.. ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాలపై ఆంక్షలు తెలంగాణ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే అమలు చేస్తున్నట్లు జీహెచ్ఎంసీ అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాలను హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేయకుండా చర్యలు తీసుకుంటున్నట్లు హైదరాబాద్ పోలీసులు స్పష్టం చేశారు. ట్యాంక్‌బండ్ వద్ద నిమజ్జనం చేయకూడదని సూచించే ఫ్లెక్సీలను కూడా ఏర్పాటు చేశారు.

అయితే.. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి మాత్రం ట్యాంక్‌బండ్‌ను సంప్రదాయ నిమజ్జన ప్రాంతంగా పేర్కొంటూ ఆంక్షలను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినప్పటికీ.. ట్యాంక్‌బండ్ వద్దే నిమజ్జన కార్యక్రమం నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. ఈ క్రమంలోనే అధికారులు విధించిన ఆంక్షలను అంగీకరించబోమని సమితి ప్రతినిధులు తేల్చి చెబుతున్నారు.

# దానం వ్యవహారంలో ఉత్కంఠ

(మొదటి పేజీ తరువాయి)

నుంచి దానం నాగేందర్ ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం ఆయన కాంగ్రెస్‌లో చేరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు.

దీనిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అనర్హత పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. స్పీకర్ గడ్డం ప్రసాద్ ఈ పిటిషన్లను కొట్టివేశారు. ఆ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఈ వ్యవహారం హైకోర్టుకు వెళ్లింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు.. ఈనెల 18వ తేదీన సంచలన తీర్పును వెలువరించింది. స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసింది. దానం నాగేందర్ పార్టీ ఫిరాయింపులకు పాల్పడినట్లు నిర్ధారిస్తూ ఆయనను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించింది. అదే సమయంలో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానాన్ని ఖాళీగా ప్రకటించాలని కూడా ఆదేశించింది. హైకోర్టు తీర్పుపై దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు తీర్పుపై స్టే ఇవ్వాలని ఆయన తరఫు న్యాయవాదులు కోరుతున్నారు. ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాల్సిన అవసరం ఉందని దానం నాగేందర్ లాయర్ ముకుల్ రోహత్గి సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా ప్రకటించిన నేపథ్యంలో ఉపఎన్నికకు సంబంధించిన ప్రక్రియ ముందుకు వెళ్లే అవకాశం ఉందని ఆయన వాదించారు. అందువల్ల పిటిషన్‌ను త్వరగా విచారించాలని కోరగా బుధవారానికి వాయిదా పడింది.

# నిమజ్జనమెలా...గణపయ్యా?..అరకొర వర్షాలకు చెరువుల్లో చేరని నీరు

- నదుల్లోనూ అదే పరిస్థితి
- అయోమయంలో ఉత్సవ కమిటీలు
- రేపు గణపయ్య నిమజ్జనాలు..



**రేగొండ సెప్టెంబరు 21 పీపుల్స్ డైరీ :** రేగొండ ఎల్‌నినో ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా చెరువుల్లో నీరు చేరలేదు. పల్లె, పట్టణమన్న తేడా లేకుండా ఎప్పట్లాగే వీధి, వీధినా భారీ విఘ్నేశ్వర ప్రతిమలను ఏర్పాటు చేశారు. వీటిని వేర్వేరు రోజుల్లో నిమజ్జనం చేసేందుకు ప్రణాళికలు తయారు చేసుకున్నారు. పోలీస్ శాఖ నుంచి అనుమతులూ తీసుకున్నారు. రోజువారీ పూజలు ఘనంగా చేస్తున్నారు. సంస్కృతిక ప్రదర్శనలూ ఏర్పాటు చేస్తున్నారు. అంతా బాగా జరుగుతోంది కానీ బొజ్జ గణపయ్యను ఈ ఏడాది ఎక్కడ నిమజ్జనం చేయాలో పాలుపోవడంలేదు. చెరువుల్లో మనిషి పాదం తడిచే స్థాయిలో కూడా నీరు లేదు. గత ఏడాది ఈ సమయానికి జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా చెరువులు జలకళతో కనిపించాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పొలాలన్నీ వరి చేనుతో పచ్చగా కనిపించాయి. చెరువులు, బావులు, బందలు, గోతులు ఇలా వేటిల్లో చూసినా వరద నీరు ఉండేది. వినాయక చవితి నుంచి నవరాత్రులు పూజించిన గణేషుడ్ని మేళ,తాళాలతో ఊరిగింపు చేసిన అనంతరం గ్రామాలకు ఆనుకుని ఉండే చెరువుల్లో నిమజ్జనం చేయడం ఆనవాయితీ. అర్ధరాత్రి సమయంలో యువత ఈత కోడుతూ అనందపడేవారు. అయితే ఇదే సమయంలో కొంత మంది ప్రమాదాల బారిన పడిన వారు వున్నారు. ఈ ఏడాది కనీస స్థాయిలో కూడా నీళ్లు లేవు. అను-పోత్సవమెలా చేయాలన్న మీమాంస నిర్వాహకులను వెంటాడుతోంది. రిజర్వాయర్‌లు, కాలుష్యంగా మారిన చెరువులు, బందల్లో మాత్రమే నీరు కనిపిస్తోంది. రిజర్వాయర్‌లు అత్యధిక గ్రామాలకు దూరంగా ఉన్నాయి. దీంతో ప్రత్యామ్నాయంగా మరికి నీటి చెరువులే కనిపిస్తున్నాయి. అయితే వాటిల్లో నిమజ్జనం చేస్తే చర్మ వ్యాధులు, అంటురోగాలు వచ్చే ముప్పు ఉంది. దీంతో నిర్వాహకులకు నేటికీ స్పష్టత లేదు. ఇదిలా ఉండగా జిల్లా వ్యాప్తంగా బుధవారం అధికంగా నిమజ్జనాలు ఉన్నాయి. తొమ్మిది రోజుకావడంతో ఎక్కువ మంది నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు.రేగొండ మండల కేంద్రం లో ప్రతి గ్రామంలో విదికో గణపయ్య ను ప్రతిష్టించారు. దాదాపు గా ప్రతి గ్రామం నుండి పది నుండి ఇరవై వరకు గణపయ్య విగ్రహాలు ఉన్నాయి.వాటిని వారి వారి గ్రామ శివారు ప్రాంతాల్లో చెరువుల్లో కుంటల్లో నీమజ్జనం చేసేవాళ్ళు కానీ ఈసారి ఏ ఒక్క గ్రామంలో చెరువులు కుంటలు పడవు గా దర్శనం ఇస్తున్నాయి.ఈ సారి నిమజ్జనం చేసేందుకు నిర్వాహకులు కాళేశ్వరం గంగ లో చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# గని కార్మికుల సమ స్యలను వెంటనే పరిష్కరించాలి

- కార్మికులకు రక్షణ పరికరాలు అందజేయాలి :
- ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ మోటపలుకుల రమేష్
- భూపాలపల్లి ఏరియాలో అన్ని గనులపై మెమోరాండం అందజేత




**భూపాలపల్లి : సెప్టెంబర్ 21 పీపుల్స్ డైరీ..** స్థానిక గనుల, గని కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) బ్రాంచ్ సెక్రటరీ మోట పలుకుల రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం భూపాలపల్లి ఏరియాలోని కేటీకే 8వ గని లో బ్రాంచ్ సెక్రటరీ తో పాటు అన్ని గనులపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గని మేనేజర్లకు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ..గత కొన్ని నెలలుగా గనుల్లో పనిచేస్తున్న కార్మికులకు అవసరమైన రక్షణ పరికరాలు, పనిముట్లు, ఇతర సౌకర్యాలు సక్రమంగా అందకపోవడంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్మికుల భద్రత విషయంలో యాజమాన్యం నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధానంగా స్థానికంగా సమస్యలైన రక్షణ పరికరాలు అందజేయా లని, గనుల్లో పనిచేసే కార్మికు లకు నాణ్యమైన మైన్ షూస్, హెల్మెట్లు ఇతర అవసరమైన రక్షణ పరికరాలను వెంటనే అందజేయాలని ఆయన కోరారు.

**అవసరమైన గని సామగ్రిని**

అన్ని గనులకు సరిపడా డ్రిల్ బిట్స్, బోల్డర్ బిట్స్, డ్రిల్ రాడ్స్, రెసిన్ క్యాప్సూల్స్, డాగ్ నెయిల్స్ తదితర అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉంచాలన్నారు.పెండింగ్‌లో ఉన్న మ్యాన్ రైడింగ్ ఎక్స్టెన్షన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి, కేటీకే వన్, కేటీకే 5, కేటీకే 8 గనుల్లో మ్యాన్ రైడింగ్ సౌకర్యాన్ని కార్మికులకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. అన్ని గనుల్లో కార్మికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని క్వార్టర్ అలాట్మెంట్ పారదర్శకంగా నిర్వహించాలని , సీఎం పి ఎఫ్ చిట్టీలు కార్మికులందరికీ యాజమాన్యం అందించాలని కోరారు.గని కార్మికులకు పెండింగ్‌లో ఉన్న సీఎం పి ఎఫ్ సమ స్యలను వెంటనే పరిష్కరించి, అన్ని గనుల్లో పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లను పరిశీలించి అర్హత కలిగిన కార్మికులకు తక్షణమే ప్రమోషన్లు మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.సమస్యల పరిష్కారం కోసం యూనియన్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో కూడా పోరాట కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీలు గురిజేపల్లి సుధాకర్ రెడ్డి, గంగసారం శ్రీనివాస్,నూకల చంద్రమౌళి, సదానందం, కేటీకే 5 గనిలో అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ ఎండి ఆసిఫ్ పాషా, జి తిరుపతి, వి రాజేందర్, కేటీకే 6 గనిలో పి. శ్రీనివాస్, కేటీకే8, ఎల్ శంకర్, కృష్ణ, పిట్ కమిటీ సభ్యులు కార్యకర్తలు, కార్మికులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# టీబీ తొలిదశలోనే గుర్తించి చికిత్స అందించడంతో పూర్తిగా అరికట్టవచ్చు






**భూపాలపల్లి సెప్టెంబర్ 21 పీపుల్స్ డైరీ..** జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు నిర్వహిస్తున్న ఉచిత స్క్రీనింగ్ శిబిరాలలో ప్రతి ఒక్కరూ పరీక్షలు చేపించుకోవాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ పి. అశోక్ కుమార్ తెలిపారు.సోమవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఐడిఓసి కార్యాలయంలో టిబి పరీక్షలు నిర్వహణ, అనంతరం వైద్య సేవలు తదితర అంశాలపై అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ లక్షణాలను తొలిదశలోనే గుర్తించి చికిత్స అందించడంతో వ్యాధి వ్యాప్తిని పూర్తిగా అరికట్టవచ్చని అన్నారు. రెండు వారాలకు పైగా దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, తెమడలో రక్తం పడటం, ఛాతీ నొప్పి, ఆయాసం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, త్వరగా అలసిపోవడం, మెడ లేదా ఇతర శరీర భాగాల్లో వాపులు, గడ్డలు ఏర్పడటం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని తక్షణమే పరీక్షలు చేపించుకోవాలని సూచించారు. శరీరంలోని పలు అవ-యవాలకు టీబీ సోకే అవకాశం ఉన్నందున అనుమానిత లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకో వాలన్నారు. తల వెంట్రుకలు, గోర్లు తప్ప శరీరంలోని ఏ అవయవానికైనా టిబి సోకే అవకాశం ఉందని నిర్లక్ష్యం చేయొద్దని తెలిపారు. టీబీ లక్షణాలు ఉన్నవారు సమీపం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లేదా జిల్లా ఆసుపత్రిలో ఉచితంగా ఎక్స్‌రే, తెమడ పరీక్షలు చేయించుకోవాలని స్పష్టంచేశారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం ద్వారా ఉచితంగా చికిత్స, మందులు అందిస్తున్నట్లు తెలిపారు. వైద్యుల సూచన మేరకు మందులను క్రమం తప్పకుండా పూర్తి కాలం వినియోగించాలని, మధ్యలో మందులు నిలిపివేస్తే డ్రగ్ రెసిస్టెంట్ టీబీ వచ్చే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గని కార్మికులు, మురికివాడల్లో నివసించే ప్రజలు, మధ-ుమేహం, హెచ్ఐవీ ఉన్నవారు, ప్రతికూల వాతావరణంలో పనిచేసే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. మొబైల్ ఎక్స్‌రే వాహనాల ద్వారా అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పక పరీక్షలు చేపించుకోవాలని తెలిపారు. ప్రతి ఉద్యోగి ఒక వ్యాధి గ్రస్థుడను దత్తత తీసుకోవాలనే నినాదంతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో ఎంపిడిఓ నోడల్ అధికారిగా, మై భారత్ వాలెంటీర్లు సభ్యులుగా ఉంటారని ముఖ్యంగా సంక్షేమ, పంచాయతి, మున్సిపల్, డిఆర్డీఓ, విద్యా, కార్మిక శాఖల సహకారం చాలా అవసరమని తెలిపారు. క్యాంపు మోడులో జరుగుతున్న టిబి స్క్రీనింగ్ పరీక్షలను ప్రతి ఒక్కరూ పరీక్షలు చేపించుకుని టిబి రహిత సమాజానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇది ఒకరి నుండి ఒకరికి సోకే వ్యాధి అని ప్రారంభంలోనే గుర్తించి వైద్య సేవలు తీసుకోవడం వల్ల పూర్తిగా నివారించడానికి అవకాశం ఉందని తెలిపారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిఆర్వో వసంత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా మధుసూదన్, ఆర్డిఓ హరికృష్ణ అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేయాలి

- అక్టోబర్ 2న కలెక్టరేట్‌ల ముట్టడి,ధర్నా విజయవంతం చేయాలి
- ఎమ్మార్పిఎస్‌డఎంఎస్పి అనుబంధ సంఘాలు



**భీమదేవరపల్లి, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** భీమదేవరపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల మండల అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ భీమదేవరపల్లి మండల అధ్యక్షుడు వేల్పుల ప్రశాంత్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ, హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాట్ల వెంకటస్వామి మాదిగ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏపూరి వెంకటేశ్వరరావు, మాట్ల వెంకటస్వామి మాట్లాడుతూ మద్యపానం కారణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయని అన్నారు. ముఖ్యంగా య-ువత మద్యం మత్తులో రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని, మద్యం మత్తులో హత్యలు, అత్యాచా రాలు వంటి నేరాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. యువత సక్రమమైన మార్గంలో నడవాలన్నా, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు ఆర్థికంగా బలోపేతం కావాలన్నా తెలంగాణలో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో అక్టోబర్ 2న అన్ని జిల్లాల కలెక్టరేట్‌ల ముట్టడి, ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.భీమదేవరపల్లి మండలం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశం లో మండల ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి దిలీప్, మిట్టపల్లి రమేష్, అధికార ప్రతినిధి మాడ్గుల ప్రణయ్ మాదిగ, కార్యదర్శి తాడూరి సన్ని, సీనియర్ నాయకులు తాళ్లపల్లి ఆశీర్వాదం, మాడ్గుల ప్రభుదాస్, పార్నందుల సురేష్, రేణుకుంట్ల భిక్షపతి, వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు పెండ్యాల కుమారస్వామి, ఎంఎస్పీ మండల ఉపాధ్యక్షుడు పార్నందుల కుమారస్వామి, కనకం రమేష్, బాకి రాజేందర్, తూముల అరవింద్, తాళ్లపల్లి విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మారెడ్డిపల్లి లో ఘనంగా గణనాథుడి మహా అన్నదానం

**పాల్గొన్న సీఐ కరుణాకర్ రావు**





**భూపాలపల్లి సెప్టెంబర్ 21 పీపుల్స్ డైరీ..** జయశంకర్ జిల్లా గణపురం మండలంలోని లక్ష్మారెడ్డి పల్లి గ్రామంలో శ్రీ రామలింగేశ్వర అభయాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో వినాయక మండపం వద్ద మహా అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గత 6 సంవత్సరాలుగా లక్ష్మారెడ్డి పల్లిలో గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామన్నారు. వినాయక ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన అన్న ప్రసాద కార్యక్రమానికి గణపురం సిఐ కరుణాకర్ రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా గణనాథుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వయంగా అన్న ప్రసాదాలను వడ్డించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సీఐ కర్ణాకర్ రావు కి శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.లిఈ కార్యక్రమంలో మహా అన్న ప్రసాద దాత మేడిపల్లి సంధ్యారాణి రాజు గౌడ్, గ్రామ సర్పంచ్ వీరమల్ల సంపత్ రెడ్డి, మాజీ సర్పంచ్, ఓద్దుల విజయ అశోక్ రెడ్డి, ఎడ్ల సంతోష్, మేడిపల్లి శ్రీనివాస్, మామిడాల శరత్ బాబు, చుక్క నరేష్, మామిడాల విజయ్ కుమార్, మాదారపు కృష్ణమూర్తి, వీరగోని నాగరాజు, వీరమల్ల వీరారెడ్డి, భోజ వాసుదేవ రెడ్డి,శ్రీశాంత్ రెడ్డి,విధ్వత్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లు చెల్లించాలని ప్రజావాణి లో పిర్యాదు



**భీమదేవరపల్లి సెప్టెంబర్ 21(పీపుల్స్ డైరీ ) :** వంగర ఎంపీపీఎస్ పాఠశాల వంటగది పెండింగ్ బిల్లు చెల్లించాలి 'మన ఊరు--మన బడి' కార్యక్రమంలో భాగంగా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో వంటగది నిర్మాణం చేపట్టారు. గ్రామానికి చెందిన గిన్నారపు కుమారస్వామి కాంట్రాక్టు తీసుకుని వంటగది నిర్మాణ పనులను పూర్తి చేశారు. నిర్మాణం పూర్తయి సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి తనకు రావాల్సిన బిల్లు చెల్లించలేదని కుమారస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లు ఇప్పించాలని కోరుతూ సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ.. వంటగది నిర్మాణం పూర్తయినప్పటి నుంచి పాఠశాలలో ప్రతిరోజూ వంట కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. అయితే నిర్మాణం పూ-ర్తయి సంవత్సరాలు గడుస్తున్నా బిల్లు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లు చెల్లించాలని అధికారులను పలుమార్లు కోరినా సమస్య పరిష్కారం కాలేదన్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి పెండింగ్ బిల్లును వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని గిన్నారపు కుమారస్వామి కోరారు.

# దివ్యాంగుల పిల్లలకు ఉచిత ఉపకరణాల కోసం నిర్ధారణ శిబిరం

**సైదాపూర్ సెప్టెంబర్ 21( పీపుల్స్ డైరీ ) :** సైదాపూర్: సైదాపూర్ మండల పరిధిలోని 0 నుండి 18 సంవత్సరాల లోపు దివ్యాంగులైన బాలబాలికలకు అవసరమైన సహాయక ఉపకరణాలను ఉచితంగా అందించేందుకు లిఅర్హత నిర్ధారణ శిబిరం ఈ నెల 22వ తేదీన హుజురాబాద్‌లో నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి కట్టా రవీంద్ర చారి తెలిపారు.కృత్రిమ అవయవాల తయారీ సంస్థ మరియు సమగ్ర శిక్ష, కరీంనగర్ జిల్లా వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని హుజురాబాద్ బస్టాండ్ ఎదురుగా ఉన్న బాయ్స్ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.ఈ శిబిరంలో నిపుణులైన సిబ్బంది దివ్యాంగులైన పిల్లలను వైద్యపరంగా, శారీరకంగా పరిశీలించి వారి వైకల్య స్థాయి, అవసరాలు మరియు రోజువారీ జీవనంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను అంచనా వేస్తారు. అర్హత కలిగిన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అవసరమైన సహాయక ఉపకరణాలను ఉచితంగా అందించేందుకు నిర్ధారణ ప్రక్రియ చేపట్టబడుతుంది.పిల్లల అవసరాన్ని బట్టి వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, వినికిడి పరికరాలు, కృత్రిమ అవయవాలు, కాలిపర్స్ తదితర సహాయక ఉపకరణాలకు అర్హతను పరిశీలించే అవకాశం ఉంటుందని తెలిపారు.

**తీసుకురావాల్సిన పత్రాలు :** శిబిరానికి హాజరయ్యే దివ్యాంగులైన పిల్లల తల్లిదండ్రులు/సంరక్షకులు తప్పనిసరిగా క్రింది పత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు: ఆధార్ కార్డు సదరం సర్టిఫికెట్ యూడీఐడీ ధ్రువీకరణ పత్రం/కార్డు ఆహార భద్రత కార్డు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు బ్యాంక్ పాస్‌బుక్ అన్ని పత్రాల ఒరిజినల్స్‌తో పాటు అవసరమైన జిరాక్స్ కాపీలను కూడా తీసుకురావాలని సూచించారు.దివ్యాంగులైన పిల్లలకు వారి అవసరాలకు అనుగుణంగా సరైన సహాయక ఉపకరణాలు అందించడం ద్వారా వారి చలన సామర్థ్యం, విద్యాభ్యాసం, దైనందిన కార్యకలాపాలు మరియు స్వయం ఆధారిత జీవనానికి మరింత తోడ్పాటు లభిస్తుందని మండల విద్యాధికారి కట్టా రవీంద్రాచారి తెలిపారు. కాబట్టి సైదాపూర్ మండలంలోని 0--18 సంవత్సరాల లోపు దివ్యాంగులైన బాలబాలికల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ పిల్లలను నిర్ధారణ శిబిరానికి తప్పనిసరిగా తీసుకురావాలని ఆయన కోరారు.మరిన్ని వివరాలకు: శ్రీ బొంగొని వెంకటేష్, మండల ఐఈఆర్పీ ని 9441446307 యందు సంప్రదించాలని పేర్కొన్నారు

## ప్రత్యేక పూజలు నిర్వహించిన యఫ్ టి వి అధినేత పాడి ఉదయనంద రెడ్డి



**వీణవంక సెప్టెంబర్ 23( పీపుల్స్ డైరీ) :** రెడ్డి పల్లి గ్రామం లోని వినాయక మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన యఫ్ టీ వి అధినేత పాడి ఉదయానంద రెడ్డి ఈ కార్యక్రమం లో ఉదయనంద రెడ్డి మాట్లాడుతూ వినాయక చవితి సంబరాలను శాంతియుతంగా జరుపుకోవాలని అలాగే వినాయకుడిని పాడిపంటలు సుఖ సంతోషాలతో రైతులు సల్లగా ఉండాలని విఘ్నేశ్వర స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. పాడి ఉదయనంద రెడ్డిని అడిగోప్పుల సంపత్ శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమం లో అడిగొప్పుల సంపత్, అడిగోప్పల సాయి తేజ,అడిగొప్పుల వెంకన్న, చింతల పరశురాములు, అడిగొప్పుల తిరుమలేష్, చింతల అరవింద్, కొమిరే శివ తో పాటు విఘ్నేశ్వర స్వామి కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 07 దరఖాస్తుల స్వీకరణ

### ఎంపీడీవోయాదగిరి నాయక్..



**సైదాపూర్ సెప్టెంబర్ 21.( పీపుల్స్ డైరీ ) :** సైదాపూర్ మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో వివిధ రకాల సమస్యలకు సంబంధించి 7 దరఖాస్తుల స్వీకరణ చేసినట్లు సైదాపూర్ ఎంపీడీవో యాదగిరి నాయక్ తెలిపారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయి ప్రజావాణికి విశేష స్పందన లభించిందని, మండలంలోని మీ వివిధ గ్రామాల ప్రజలు ప్రజావాణిని ఉపయోగించి, తమ సమస్యల పట్ల దరఖాస్తులు చేసుకున్నారని ఎంపీడీవో తెలిపారు.. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులతో ఎమ్మార్వో శ్రీనివాస్ , ఏవో వైదేవి మండల విద్యాధికారి రవీంద్రా చారి ఎం పి ఓ ఖాజా నిజామ-ుద్దీన్ ట్రాన్స్కో ఏ ఈ లు అశోక్, వెంకట రమణారెడ్డి, హౌసింగ్ ఏ రాజు, ఆర్డబ్ల్యూఎస్ గిరీష్ బాబు ఐ సి డి ఎస్, హిమవర్ష మండల ఇతరు అధికారులు తదితరులు పాల్గొన్నారు..

## అనారోగ్యంతో యువకుడి మృతి..



**రేగొండ సెప్టెంబర్ 21 పీపుల్స్ డైరీ..** రేగొండ: మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన తక్కళ్లపల్లి అఖిల్ (20) అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అఖిల్ గ్రామంలోనే డీజే టెంట్‌హౌస్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సుమారు 20 రోజుల క్రితం అఖిల్ కళ్లు తిరిగి ఒక్కసారిగా కిందపడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న అఖిల్‌కు సోమవారం ఉదయం గుండె కొట్టుకోవడం ఆగిపోయింది. వైద్యులు సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మల్టిపుల్ ఆర్గాన్ డ్యామేజ్ కారణంగా అఖిల్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు పేర్కొన్నారు. మృతుడికి తల్లి దండ్రులు పద్మ అయిలుస్వామి ఉండగా ఒక సోదరుడు నాగరాజు ఉన్నారు. చిన్న వయసులోనే అఖిల్ మృతి చెందడంతో తిరుమలగిరి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

## కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం

### కేసీఆర్ కుటుంబ ఆస్తులపై కడియం శ్రీహరి సంచలన వ్యాఖ్యలు

### ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్న కడియం శ్రీహరి



హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని వరంగల్ ఎంపీ కడియం కావ్య, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డితో కలిసి స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఘనంగా ప్రారంభించారు. నూతనంగా ఎన్నికైన మండల కమిటీ ప్రతినిధులను శాలువాలతో సన్మానించిన అనంతరం జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, ప్రజాక్షేత్రంలో ఉంటూ రేవంత్ రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి అయ్యేలా పట్టుదలతో పనిచేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. 'కొత్త, పాత' వ్యత్యాసాలు వీడి, కేవలం పార్టీ పేరు చెప్పుకుని తిరిగే సంస్కృతికి దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. ఇదే సమయంలో ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గడిచిన 12 ఏళ్లలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు ఒక్క జాతీయ సంస్థనుగానీ, రూ.1000 కోట్ల ప్రాజెక్టునుగానీ మంజూరు చేయకుండా కుల, మత రాజకీయాలతో చిచ్చు పెడుతోందని ఆరోపించారు. మరోవైపు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుంటూ, 2014 ఎన్నికల అఫిడవిట్‌లో ఒక్క ఎకరం భూమి కూడా లేదని చూపించిన కల్వకుంట్ల కుటుంబానికి పదేళ్ల పాలన తర్వాత నేడు వందల ఎకరాలు, ఫామ్‌హౌస్‌లు, వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. 2014కి ముందు ఉన్న ఆస్తులు, ప్రస్తుతం ఉన్న సంపదపై తెలంగాణ ప్రజలకు కేసీఆర్ కుటుంబం సమాధానం చెప్పాలని కడియం శ్రీహరి సవాల్ విసిరారు.

## ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం-ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



**భూపాలపల్లి సెప్టెంబర్ 21 పీపుల్స్ డైరీ..** భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధి త అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి మొత్తం 16 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును ఎస్పీ శ్రద్ధగా విని, సంబంధిత పోలీస్ స్టేషన్ సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి, సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి పైరవీలు లేదా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కట్టుబడి ఉందని, ప్రజలకు మరింత చేరువగా ఉండి శాంతి భద్రతలను పరిరక్షించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, సంబంధిత అధికారుల సమన్వయం తో త్వరితగతిన పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు సత్వర, పారదర్శకమైన సేవలు అందించేందుకు భూపాల పల్లి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

## రైతులకు అలర్ట్.. సెప్టెంబర్ 30లోగా ఈ పని పూర్తి చేయాలి!

- **సెప్టెంబర్ 22 నుంచి 30 వరకు ప్రత్యేక క్యాంపెయిన్లు**
- **గ్రామాల్లోనే నమోదు చేసుకునే అవకాశం**
- **ఏఈఓ లేదా మీ సేవలోనూ రిజిస్ట్రేషన్**
- **ఆధార్, పాస్‌బుక్, మొబైల్ అవసరం**
- **ఫార్మర్ ఐడీతో పథకాలు, సబ్సిడీలు**

తెలంగాణ రైతులకు ప్రభుత్వం కీలక సూచన చేసింది. ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని స్పష్టం చేసింది. రైతులకు ప్రత్యేక గుర్తింపు కల్పించడంతో పాటు ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, రాయితీలు సులభంగా అందించేందుకు ఈ విధానాన్ని తీసుకొచ్చారు. ఇందులో నమోదు చేసుకున్న ప్రతి రైతుకు ప్రత్యేకమైన ఫార్మర్ ఐడీ వస్తుంది. రైతుల నమోదు కోసం సెప్టెంబర్ 22 నుంచి 30వ తేదీ వరకు గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో అధికారులు గ్రామాల్లోకి వచ్చి రైతుల రిజిస్ట్రేషన్ చేస్తారు. అక్కడే రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు. అలాగే మండలంలోని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) వద్ద లేదా మీ సేవ కేంద్రంలోనూ రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉంది. ఇప్పటికే ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకున్న రైతులు మళ్లీ నమోదు చేసుకోవాల్సిన అవసరం లేదు. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత వచ్చే ఫార్మర్ ఐడీ నంబర్‌ను జాగ్రత్తగా గుర్తుపెట్టుకోవాలి. పీఎం కిసాన్, రైతు భరోసా వంటి పథకాలకు ఈ ఐడీ అవసరం అవుతుంది.



### రిజిస్ట్రేషన్‌కు ఏం కావాలి?

ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవడానికి ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్ అవసరం.

### ఫార్మర్ ఐడీతో ఏం ఉపయోగం?

ఫార్మర్ ఐడీ ఉంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, సేవలు, రాయితీలు, సబ్సిడీలు పొందేందుకు ఉపయోగపడుతుంది. బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందడంలోనూ ఇది సహాయపడుతుంది. ఎరువుల బుకింగ్‌కు ఉపయోగించే ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ యాప్‌లోనూ ఇది అవసరం. వరి, పత్తి, మొక్కజొన్న, కంది వంటి పంటలకు కనీస మద్దతు ధర పొందే ప్రక్రియలోనూ ఫార్మర్ ఐడీ ఉపయోగపడుతుంది.

### ఫార్మర్ ఐడీ ఎలా తెలుసుకోవాలి?

ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు తమ ఫార్మర్ ఐడీని ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చు. ముందుగా ఫార్మర్ రిజిస్ట్రీ అధికారిక వెబ్‌సైట్‌ను తెరవాలి. ఆధార్ నంబర్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. మీ ఆధార్ నంబర్‌ను నమోదు చేయాలి. ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్‌కు వచ్చిన ఓటీపీని ఎంటర్ చేసి సబ్మిట్ చేస్తే మీ ఫార్మర్ ఐడీ నంబర్ స్క్రీన్‌పై కనిపిస్తుంది. కాబట్టి ఇప్పటికే నమోదు చేసుకోని రైతులు సెప్టెంబర్ 30లోగా ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ప్రభుత్వం సూచిస్తోంది.

## ట్యాంక్‌బండ్ వద్ద తీవ్ర ఉద్రిక్తత.. పోలీసులతో ఉత్సవ సమితి ఘర్షణ

- **బారికేడ్లు తొలగింపు!**
- **గణేశ్ నిమజ్జనంపై ఆంక్షలతో ట్యాంక్‌బండ్‌పై హైటెన్షన్**
- **నిరసనకు దిగిన భాగ్యనగర్ ఉత్సవ సమితి, పోలీసుల మధ్య తోపులాట**
- **హైకోర్టు ఆదేశాల మేరకే ఆంక్షలని అధికారుల స్పష్టీకరణ**
- **సంప్రదాయాన్ని వీడేది లేదని, ట్యాంక్‌బండ్‌పైనే నిమజ్జనం చేస్తామని పట్టు**
- **పీఓపీ విగ్రహాల కోసం కృత్రిమ కొలనులు ఏర్పాటు చేస్తున్న జీహెచ్‌ఎంసీ**

హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై గణేశ్ విగ్రహాల నిమజ్జనం అంశం మరోసారి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. హుస్సేన్‌సాగర్‌లో ట్యాంక్ బండ్ వైపు విగ్రహాల నిమజ్జనానికి అనుమతి లేదంటూ అధికారులు ఏర్పాటు చేసిన ఆంక్షలను వ్యతిరేకిస్తూ భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ఆందోళనకు దిగింది. ఈ క్రమంలో ఉత్సవ సమితి ప్రతినిధులకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. దీంతో ట్యాంక్‌బండ్ పరిసరాల్లో హైటెన్షన్ వాతావరణం



నెలకొంది. వివరాల్లోకి వెళితే.. ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాలకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉత్సవ సమితి ప్రతినిధులు అక్కడ బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన కొన్ని బారికేడ్లను తొలగించేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ తోపులాటలో కొందరు పోలీసులు కిందపడిపోయినట్లు సమాచారం. అప్రమత్తమైన ఉన్నతాధికారులు అదనపు బలగాలను మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తు న్నారు. మరోవైపు తెలంగాణ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే పర్యావరణ పరిరక్షణ కోసం హుస్సేన్‌సాగర్‌లో, ముఖ్యంగా ట్యాంక్‌బండ్‌పై ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాల నిమజ్జనాన్ని నియంత్రిస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ, పోలీసు అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇందులో భాగంగానే ట్యాంక్‌బండ్‌పై నుంచి విగ్రహాలను నేరుగా సాగర్‌లో వేయకుండా 10 అడుగుల రైలింగ్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ నిమజ్జనం నిషిద్ధమంటూ ఫ్లెక్సీలను కూడా పెట్టారు. అయితే, ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించింది. ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, నెక్లెస్ రోడ్ ప్రాంతాల్లో మట్టి, పర్యావరణ హిత విగ్రహాల నిమజ్జనం కోసం క్రేన్లను సిద్ధం చేస్తున్నారు. పీఓపీ విగ్రహాల కోసం ప్రత్యేకంగా కృత్రిమ కొలనులను (బేబీ పాండ్స్) ఏర్పాటు చేస్తున్నారు. అయినప్పటికీ ఈ ఏర్పాట్లను భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ట్యాంక్‌బండ్ అనేది సంప్రదాయ నిమజ్జన ప్రాంతమని, అక్కడే కార్యక్ర మానికి అనుమతించాలని డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వం ఏర్పాట్లు చేయ కపోతే తామే సొంతంగా క్రేన్లు తెచ్చి నిమజ్జనాలు చేస్తామని ఆదివారమే హెచ్చరించింది. మొత్తంమీద ఒకవైపు కోర్టు ఆదేశాలు, పర్యావరణ పరిరక్షణ నిబంధనలు, మరోవైపు సంప్రదాయం పేరుతో ఉత్సవ సమితి పట్టుదల మధ్య హైదరాబాద్ గణేశ్ నిమజ్జనం అంశం మరోసారి వివాదాస్పదంగా మారింది. ఈ ప్రతిష్ఠంభన ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందోనని నగరవాసుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

## 'సర్' ప్రక్రియ పేరుతో వికృత చేష్టలకు పాల్పడుతున్నారు: సీపీఐ నారాయణ

- **అద్వానీ, జైశంకర్ వంటి ప్రముఖులకు కూడా నోటీసులు జారీ చేశారని విమర్శ**
- **వివాహానంతరం మహిళల ఇంటిపేర్లు మారడాన్ని కూడా పెద్ద సమస్యగా చూపుతున్నారని మండిపాటు**

ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రక్షాళన (సర్) పేరుతో చేపడుతున్న వింత, వికృత చర్యలు ప్రజల ప్రాథమిక ఓటు హక్కును కాపాడేలా లేవని, విజ్ఞతలేని తీరుతో ఓటర్లను తీవ్రంగా అవమానించేలా ఉన్నాయని సీపీఐ సీనియర్ నేత నారాయణ ఘాటుగా విమర్శించారు. సర్ ప్రక్రియ పేరుతో ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తున్న వైఖరి 'ఎద్దు ఈనిందంటే దూడను గాట్లో కట్టేయమన్నట్లుగా' ఉందని ఎద్దేవా చేశారు. ఓటర్ల వివరాల్లో ఏవైనా




సాంకేతిక లోపాలు, తప్పులు ఉంటే వాటిని క్షేత్రస్థాయిలో సరిదిద్దాలే తప్ప, దేశ మాజీ ఉపప్రధాని ఎల్.కె. అద్వానీ, ప్రస్తుత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వంటి అత్యున్నత ప్రముఖులకు కూడా నోటీసులు జారీ చేయడం ఏ రకమైన ప్రక్షాళన అని ఆయన నిలదీశారు. పేర్లలో చిన్నపాటి స్పెల్లింగ్ పొరపాట్లు, వివాహానంతరం మహిళల ఇంటిపేర్లు మారడం వంటి అత్యంత సహజమైన అంశాలను కూడా పెద్ద సమస్యలుగా చిత్రీకరించడం, తాతముత్తాతల పుట్టిన తేదీలను వెతకాలంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం విడ్డూరంగా ఉందని నారాయణ మండిపడ్డారు. దేశంలో ఉన్న కోట్లాది మంది ఓటర్ల హక్కుల పరిరక్షణ విషయంలో ఎన్నికల సంఘం అత్యంత పారదర్శకంగా, రాజ్యాంగబద్ధమైన నిష్పక్షపాతంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రధాని కార్యాలయం నడిపించే ఒక 'సురభి నాటకం'లో స్వయంప్రతిపత్తి గల ఎన్నికల కమిషన్ అపవిత్రమైన పావుగా మారకూడదని తీవ్ర స్థాయిలో విమర్శించారు.

## మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి హౌస్ అరెస్ట్

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు తక్షణమే సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన ప్రాజెక్టు ముట్టడి పిలుపు జిల్లా వ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పోలీసులు భారీ ఎత్తున రంగంలోకి దిగి ముందస్తు అరె-స్టులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిని వనపర్తిలోని ఆయన నివాసంలో పోలీసులు అదుపులోకి తీసుకుని గృహనిర్బంధం చేశారు. ముట్టడి కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద ఇంటెలిజెన్స్ బలగాలను మోహరించి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

పోలీసుల దిగ్బంధంతో జూరాల ఆనకట్ట పరిసరాలు, క్షేత్రస్థాయి ప్రాంతాలు పూర్తిగా వ్యూహాత్మక బలగాల మోహరింపుతో నిండిపోయాయి. వనపర్తి, ఆత్మకూరు,



అమరచింత, నర్వ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రాజెక్టు వైపు రాకుండా రహదారుల వెంట వాహన తనిఖీలు చేపట్టారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు





**భూపాలపల్లి, సెప్టెంబర్ 21 పీపుల్స్ డైరీ:** కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ,అన్నారు. తెలంగాణ ఉద్యమ నాయకుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతిని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బాపూజీ విగ్రహానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం బాపూజీ చేసిన కృషి, త్యాగాలు చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. క్యాతం సతీష్ కుమార్ మాట్లాడుతూ ప్రజల కోసం పదవులు ఉండాలనే సందేశాన్ని బాపూజీ తన జీవితంతో చాటిచెప్పారని, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని అన్నారు. ఈ తెలంగాణ రాజకీయాలు కార్యక్రమంలో భూపాలపల్లి టౌన్ అధ్యక్షులు, చిట్యాల మండల అధ్యక్షులు, పద్మశాలి సంఘం నాయకులు భాగవతం బిక్షపతి, సేరు కుమారస్వామి, దాసరి సుదర్శన్, కుసుమ కృష్ణమోహన్, పాసికంటి శ్రీనివాస్, గుండా వీరస్వామి, పుల్లె రాజేశం, ఎల్ల శంకర్, పేరాల వెంకటేశం, బొద్దుల శంకర్, మావిడాల రవీందర్, దుంప నర్సయ్య, బూర ప్రవీణ్, కొలిపాక శ్రీనివాస్, వంగ కుమారస్వామి, కొలిపాక ప్రసాద్, కుసుమ చంద్రశేఖర్, మామిడి శ్రీకాంత్, కొండి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో 108 సేవలను సద్వినియోగం చేసుకోవాలి



**ఆళ్లపల్లి, సెప్టెంబరు 21 (పీపుల్స్ డైరీ) :** ఆళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద అందుబాటులో ఉన్న 108 అంబులెన్స్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 108 అధికారి సతీష్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్‌లోని అత్యవసర వైద్య పరికరాలు, మందులు, ఇతర సామగ్రిని స్వయంగా పరిశీలించి వాటి పనితీరును పరీక్షించారు. అంబులెన్స్‌లోని బీపీ ఆపరేటర్, స్టెతస్కోప్, గ్లూకోమీటర్, థర్మామీటర్, పురుగుమందు సేవించిన బాధితులకు ఉపయోగించే పరికరాలు, గుండెపోటు బాధితుల కోసం ఏఈడీ పరికరం, ఆక్సిజన్ సిలిండర్, స్ట్రెచర్, స్కూప్ స్ట్రెచర్, స్పైన్ బోర్డు, వీల్‌చైర్ తదితర అత్యవసర పరికరాలను పరిశీలించారు. ప్రతి పరికరం అందుబాటులో ఉండటంతో పాటు అత్యవసర సమయాల్లో సక్రమంగా పని చేసేలా సిద్ధంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో రోగిని ఆస్పత్రికి తరలించే వరకు 108 సిబ్బంది అందుబాటులో ఉన్న పరికరాలతో ప్రాథమిక చికిత్స అందిస్తారని సతీష్ తెలిపారు. జీపీఎస్ ఆధారిత అధునాతన సాంకేతికతతో అంబులెన్స్‌లలో ట్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయని, రూట్‌మ్యాప్ ద్వారా ప్రమాదం జరిగిన ప్రదేశానికి, గ్రామాలకు తక్కువ సమయంలో చేరుకునే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్‌లో వైద్యం అందేలా వీలైనంత త్వరగా ఆస్పత్రికి తరలించడంలో 108 సేవలు కీలకపాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. మండలంలోని ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. రోడ్డు ప్రమాదాలు, గుండెపోటు, పాము కాటు, పురుగుమందు సేవించడం, గర్భిణుల అత్యవసర పరిస్థితులు, ఇతర అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు ఆలస్యం చేయకుండా 108కు సమాచారం అందించాలని తెలిపారు. సమాచారం అందిన వెంటనే సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని అవసరమైన ప్రాథమిక వైద్యసేవలు అందిస్తూ బాధితులను సమీప ఆస్పత్రికి తరలిస్తారని వివరించారు. అంబులెన్స్ ఎల్లప్పుడూ అత్యవసర సేవలకు సిద్ధంగా ఉండేలా వాహనాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరికరాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆళ్లపల్లి మండలంలో 24 గంటలూ 108 సేవలు అందుబాటులో ఉండేలా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆళ్లపల్లి 108 అంబులెన్స్ పైలెట్ పరమ సునీల్‌కుమార్, ఈయంటి పరమ ఆకాష్, పాల్గొన్నారు.

# అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని వెంటనే అమలు చేయాలి

- ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి రూ.12 లక్షల ఆర్థిక సాయం అందించాలి
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వైరా డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు తాళ్లపల్లి కృష్ణ, కొండబోయిన నాగేశ్వరరావు డిమాండ్



**సింగరేణి (కారేపల్లి), సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ):** ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి అంబేద్కర్ అభయ హస్తం పథకం కింద రూ.12 లక్షల ఆర్థిక సాయం అందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వైరా డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు తాళ్లపల్లి కృష్ణ, కొండబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం కారేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ.. 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో ప్రకటించిన హామీల్లో భాగంగా అంబేద్కర్ అభయ హస్తం పథకం ద్వారా రూ.12 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చిందని వారు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో దళిత బంధు పథకం కింద రూ.10 లక్షల సాయం ప్రకటించినప్పటికీ అందరికీ ప్రయోజనం అందలేదని వారు పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అంబేద్కర్ అభయ హస్తం పథకం అమలుపై జాప్యం చేయడం వల్ల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అనేక కుటుంబాలకు భూమి, ఇల్లు, విద్య, వైద్యం, స్వయం ఉపాధి వంటి కనీస ఆర్థిక వనరులు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆ కుటుంబాల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి నేరుగా ఆర్థిక సాయం అందించడం అవసరమ న్నారు. బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి నిధులు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంటున్నప్పటికీ, అంబేద్కర్ అభయ హస్తం పథకం అమలుకు నిధులు కేటాయింపు, ఖర్చుపై స్పష్టత ఇవ్వాలని వారు కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలులో జాప్యానికి కారణాలను ప్రభుత్వం ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే పథకాన్ని అమలు చేసి ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి రూ.12 లక్షల ఆర్థిక సాయం అందించాలని కోరారు. హామీ అమలుపై ప్రభుత్వం స్పందించకపోతే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన, పోరాట కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని తాళ్లపల్లి కృష్ణ, కొండబోయిన నాగేశ్వరరావు హెచ్చరించారు.

# అంగన్వాడీ టీచర్లు గ్రామస్థాయిలో జాగృతికి కృషి చేయాలి: సీడీపీఓ ఉమ

- మహిళలు, పిల్లల అక్రమ రవాణా నిర్మూలనలో అంగన్వాడీలకు శిక్షణ
- సైబర్ మోసాలు, బ్లాక్‌మెయిల్‌పై అవగాహన కల్పించాలి



**సింగరేణి, (కారేపల్లి) సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ):** మహిళలు, చిన్నారుల అక్రమ రవాణా నిర్మూలనలో అంగన్వాడీ టీచర్లు కీలక పాత్ర పోషించాలని కామేపల్లి ఐసీడీఎస్ సీడీపీఓ ఉమ సూచించారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ కామేపల్లి, ఖమ్మం ఆధ్వర్యంలో అప్పాయిగూడెం రైతు వేదికలో అంగన్వాడీ టీచర్లకు మానవ అక్రమ రవాణా, సైబర్ ట్రాఫికింగ్, సంబంధిత చట్టాలపై ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అప్పాయిగూడెం సర్పంచ్ దండు ప్రవీణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీడీపీఓ ఉమ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా తీవ్రమైన నేరమని, ప్రతిరోజూ అనేక మంది మహిళలు, బాలికలు దీని బారిన పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్, మెసెంజర్ వంటి సామాజిక మాధ్యమాల్లో యువత పోస్టు చేసే ఫొటోలను సైబర్ నేరగాళ్లు డౌన్‌లోడ్ చేసి మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేసే అవకాశాలు ఉన్నాయని, తద్వారా లైంగిక వేధింపులకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. అంగన్వాడీ టీచర్లు మదర్స్ మీటింగ్‌లతో పాటు గ్రామస్థాయిలో ప్రజలకు ఈ అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. సమస్యలు ఎదురైతే 1930 సైబర్ హెల్ప్‌లైన్ను సంప్రదించాలని, బాల్య వివాహాలు లేదా మహిళలు, బాలికలపై నేరాలు జరిగినప్పుడు సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం అందించాలని తెలిపారు. ప్రజ్వల జిల్లా సమన్వయకర్త సురేష్ కుమార్ మాట్లాడుతూ ఆడపిల్లలు, మహిళల రక్షణ కోసం ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ పనిచేస్తోందని తెలిపారు. పద్మశ్రీ డాక్టర్ సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు వేలాది మంది బాలికలు, మహిళలకు రక్షణ, పునరావాసం కల్పించేందుకు సంస్థ కృషి చేసిందన్నారు. అంగన్వాడీ టీచర్లకు బి ఎన్ ఎస్--2023, ఐటిపిఏ--1956,పోక్సో--2012, బాల్య వివాహాల నిషేధ చట్టం--2006, జేజేఏ--2015 తదితర చట్టాలపై అవగాహన కల్పించి, ముఖ్యమైన నిబంధనలు, సంబంధిత అధికారులతో సమన్వయం చేసే విధానాలను వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో 112--పోలీస్/అత్యవసర సేవలు, 1930--సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్, 181--మహిళా హెల్ప్‌లైన్ వంటి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. శిక్షణ పొందిన అంగన్వాడీ టీచర్లతో గ్రామస్థాయిలో సమాజ జాగృతి సంఘాలను ఏర్పాటు చేసి, మహిళలు, పిల్లలు ఎదుర్కొనే సమస్యలను గుర్తించి సంబంధిత అధికారులకు నివేదించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజ్వల కోఆర్డినేటర్లు భూపాల్, నాగరాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సత్యశీలా, దేవేంద్ర, కృష్ణకుమారి, సింగరేణి మండల అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో కొత్త రాజకీయ పార్టీని ప్రారంభిస్తున్న మాజీ మావోయిస్టులు

## లంకా పాపిరెడ్డి, అడ్వొకేట్ బల్ల రవీంద్రనాథ్ నేతృత్వంలో పార్టీ

## పార్టీ నిర్మాణంలో దేవ్‌జీ, సంగ్రామ్ ల భాగస్వామ్యం లేనట్టు సమాచారం

తెలంగాణ దశాబ్దాల సామాజిక, రాజకీయ ఆకాంక్షలకు, ఉద్యమ భావజాలానికి ప్రాతిపదికగా రాష్ట్ర రాజకీయ యవనికపై త్వరలోనే నూతన పార్టీ ఆవిర్భవించేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. దాదాపు ఐదు దశాబ్దాలుగా విప్లవోద్యమాల్లో చురుగ్గా పనిచేసి, తదనంతరం సామాన్య జీవితంలోకి అడుగుపెట్టిన మాజీ మావోయిస్టులే ప్రధాన చోదకశక్తిగా 'జన తెలంగాణ పార్టీ' రూపుదిద్దుకుంటోంది. లంకా పాపిరెడ్డి (లచ్చన్న), అడ్వొకేట్ బల్ల రవీంద్రనాథ్, గురిజాల రవీందర్‌రావులతో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన అభ్యుదయవాదులు, పౌరహక్కుల ఉద్యమకారులు ఇందులో కీలక పాత్ర పోషించనున్నారు. అయితే, ఆపరేషన్ కగార్ అనంతర పరిణామాల్లో బయటకు వచ్చిన దేవ్‌జీ-సంగ్రామ్ లేదా సోనూ-ఆశన్న వర్గాలు ఈ పార్టీ నిర్మాణంలో భాగస్వాములు కావడం లేదని తెలుస్తోంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్య విధానంలోకి అడుగుపెడుతున్న ఈ కొత్త పార్టీ, త్వరలో జరగనున్న వరంగల్-ఖమ్మం-నల్లగొండ... హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతోంది. భారీ ప్రాజెక్టులు, జీడీపీ గణాంకాలే అభివృద్ధి కాదని, సామాన్యులకు ఉచిత విద్య, వైద్యం, యువతకు ఉపాధి, ప్రశ్నించే స్వేచ్ఛే అసలైన అభివృద్ధి ప్రామాణికాలని తమ విధానపత్రంలో పొందుపరచనున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పుష్కర కాలమైనా ప్రజా సమస్యలు తీరలేదన్న అభిప్రాయంతో ఉన్న ఈ బృందం, త్వరలోనే కేంద్ర ఎన్నికల కమిషన్‌కు పార్టీ నమోదు కోసం అధికారికంగా దరఖాస్తు చేయనుంది.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలకు హైకోర్టు నోటీసులు

## అసెంబ్లీ స్పీకర్ ను దూషించిన కేసు



తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను అసభ్య పదజాలంతో దూషించారనే ఆరోపణల కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం షాక్ ఇచ్చింది. నాంపల్లి సీనియర్ సివిల్ కోర్టు ఇచ్చిన అరెస్ట్, రిమాండ్ నిరాకరణ ఉత్తర్వులను సవాలు చేస్తూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం, ఈ వ్యవహారంలో తమ సమాధానాన్ని వివరణాత్మకంగా కౌంటర్ దాఖలు చేయాలని ఇద్దరు ఎమ్మెల్సీలకు అధికారిక నోటీసులు జారీ చేసింది. విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగేశ్వరరావు కోర్టు ఎదుట వాదనలు వినిపిస్తూ, రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న వ్యక్తిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు అత్యంత అనుచిత పదజాలంతో దూషించడమే కాకుండా... విధులు నిర్వర్తిస్తున్న పోలీసు అధికారులపై కూడా దాడులకు తెగబడ్డారని తెలిపారు. వీరిద్దరి అరెస్టును, రిమాండ్‌ను అడ్డుకుంటూ నాంపల్లి కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలని కోరారు. ఇరు వర్గాల ప్రాథమిక నివేదికలను పరిశీలించిన హైకోర్టు, తదుపరి స్పష్టత కోసం ఎమ్మెల్సీల కౌంటర్ దాఖలుకు ఆదేశిస్తూ తదుపరి విచారణను ఎల్లుండికి వాయిదా వేసింది.

# కేసీఆర్ చారిత్రక నిర్లక్ష్యంతోనే నీటి ఎద్దడి: జూపల్లి కృష్ణారావు

## వైఎస్సార్ హయాంలో ప్రారంభించిన ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపాటు



గత బీఆర్ఎస్ ప్రభుత్వ అవగాహన రాహిత్యం, నిర్లక్ష్యపూరిత విధానాల వల్లే నేడు రాష్ట్రంలో నీటి నిల్వలు తగ్గి రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి దాపురించిందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అసెంబ్లీ ప్రాంగణంలోని మీడియా సెంటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన... కేసీఆర్ హయాంలో కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను కేవలం 30 శాతానికే పరిమితం చేసి ఆంధ్రా ప్రాజెక్టులకు లబ్ధి చేకూర్చారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పోరాడి ఆ వాటాను 43 శాతానికి పెంచుకున్నామని స్పష్టం చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రారంభించిన కల్వకుర్తి, భీమా, నెట్టంపాడు ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే పాలమూరు తీవ్రంగా నష్టపోయిందన్నారు. రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసిన కేసీఆర్ పాలమూరు జిల్లాలో రిజర్వాయర్లను ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. గట్టు వద్ద 20 టీఎంసీల రిజర్వాయర్ కడతానని చెప్పిన కేసీఆర్ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని విమర్శించారు. జూరాల వద్ద అదనపు రిజర్వాయర్ నిర్మించకపోవడం వల్లే ఈనాడు 5.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ఈ నీటి ఎద్దడిని నివారించేందుకు 15 టీఎంసీల గూడెందొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి జీవో జారీ చేయడమే కాకుండా, రికార్డు స్థాయిలో 19,543 మెగావాట్ల విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుంటూ సరఫరా వ్యవస్థను కాపాడుతోందని వెల్లడించారు. ఎల్ నినో కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్రం నుంచి రూ.20 వేల కోట్ల నిధులు, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకురావడంలో విఫలమైన బీఆర్ఎస్, బీజేపీ నేతలు కేవలం శవాలపై పేలాలు ఏరుకునే రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

# జగద్గిరిగుట్ట లో గణపయ్యకు ఘనమైన పూజలు

**కుత్బుల్లాపూర్ :**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జగద్గిరిగుట్ట చివరి బస్ స్టాప్‌లోని తెలంగాణ తల్లి విగ్రహ ఆవరణలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథునికి సోమవారం ఎనిమిదవ రోజు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ కౌన్సిలర్ కే. ఏసురత్నం, సీపీఐ మండల నాయకులు డి. రాములు హాజరై గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలంతా ఐకమత్యంతో, భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు చంచారపు భాస్కర్ రెడ్డి, కూరపాటి శ్రీరామరాజు, పాండాల శ్రీనివాస్ గౌడ్, సరస్వతి నరేందర్ రాజు, జనుముల జగన్మోహన్ ముదిరాజ్, రాజగిరి నరేష్ రెడ్డి, బింగి శ్రీనివాస్ గౌడ్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు. మంగళవారం మధ్యాహ్నం 1 గంటకు గణేష్ మండపం ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు, బుధవారం గణనాథుని నిమజ్జనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు

# పుస్తకాలను ప్రజల చెంతకు తీసుకెళ్లే 'నవచేతన'

## కోరుట్లలో సంచార పుస్తకాలయం ప్రారంభం




**కోరుట్ల :** పుస్తకం చదవాలన్న ఆసక్తి ఉన్నా అందుబాటులో పుస్తకాలు లేకపోతే ఆ అలవాటు ముందుకు సాగదు. పుస్తకాలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ఏర్పాటుచేసిన 'నవచేతన సంచార పుస్తకాలయం'ను కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ అనూప్‌రావు ప్రారంభించారు. విద్యార్థులు, యువత చదివే అలవాటును పెంచుకోవాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు. పుస్తకాలు కొత్త విషయాలను తెలియజేయడమే కాకుండా, చదివిన విషయాన్ని ప్రశ్నించి అర్థం చేసుకునే అవకాశం కల్పిస్తాయని అన్నారు. సంచార పుస్తకాలయాన్ని సద్వినియోగం చేసుకుని పఠనాన్ని రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

**చదివే కొద్దీ పెరిగే అవగాహన :** పుస్తకాలయం ప్రారంభం సందర్భంగా జువ్వాడి కృష్ణారావు, డాక్టర్ అనూప్‌రావు పుస్తక పఠనం ప్రాధాన్యాన్ని వివరించారు. ఒక విషయం గురించి పైపైన తెలుసుకోవడంతో ఆగిపోకుండా, దానిని లోతుగా పరిశీలించేందుకు చదువు తోడ్పడుతుందని చెప్పారు. సాహిత్యం, చరిత్ర, విజ్ఞానం, సామాజిక అంశాలకు సంబంధించిన పుస్తకాలు చదివితే మనకు తెలియని విషయాలతో పాటు ఇతరుల అనుభవాలు కూడా తెలుసుకోవచ్చన్నారు. మంచి పుస్తకం జీవితంలో మార్గదర్శిగా నిలుస్తుందని, పఠనంతో ఆలోచనా పరిధి విస్తరిస్తుందని పేర్కొన్నారు.

**పాఠ్యపుస్తకాలతోనే ఆగొద్దు :** సీపీఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా ఇతర పుస్తకాలనూ చదవాలని సూచించారు. జీవిత చరిత్రలు, సాహిత్యం, చరిత్ర, విజ్ఞాన సంబంధమైన రచనలు చదివితే సమాజాన్ని అర్థం చేసుకునే అవకాశం పెరుగుతుందన్నారు. నిరంతరం చదవడం వల్ల కొత్త పదాలు తెలుస్తాయని, భాషపై పట్టు వస్తుందని, తమ అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పగలుగుతారని వివరించారు. పఠనం వ్యక్తిత్వ వికాసానికి కూడా దోహదపడుతుందని చెప్పారు.

**సెల్‌ఫోన్ మధ్య పుస్తకానికీ సమయం :**

సెల్‌ఫోన్, సామాజిక మాధ్యమాల ద్వారా సమాచారం వెంటనే అందుతున్నప్పటికీ, ఒక అంశంపై ఏకాగ్రతతో చదివి అవగాహన పెంచుకోవడానికి పుస్తకానికి సమయం కేటాయించాలని నాయకులు అన్నారు. 'పుస్తకాలు చదవండి.. జ్ఞానం పెంచుకోండి' అనే సందేశంతో పుస్తకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లే నవచేతన ప్రయత్నాన్ని అభినందించారు. విద్యార్థులు, యువతతో పాటు అన్ని వయసుల వారు సంచార పుస్తకాలయాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాఘవేంద్ర, తిరుమల వసంత గంగాధర్, అన్నం అనిల్, రుద్ర శ్రీనివాస్, కస్తూరి లక్ష్మీనారాయణ, ముల్క ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# శిధిలావస్థలో ఉన్న ప్రభుత్వ క్వార్టర్లను ప్రజావసరాలకు వినియోగించాలి



**జగిత్యాల :** జగిత్యాల పట్టణంలోని శ్రీరామ థియేటర్ ఎదురుసందు నుంచి టీవీ స్టేషన్ వరకు వెళ్లే మార్గంలో శిధిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ, మున్సిపల్ క్వార్టర్ల సమస్యను పరిష్కరించాలని కోరుతూ కౌన్సిలర్ అరవ లక్ష్మి,-రాజు రాజు ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. చాలా కాలంగా వినియోగంలో లేకపోవడంతో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ డీఈ తదితర క్వార్టర్లు పూర్తిగా శిధిలావస్థకు చేరుకున్నాయని, భవనాలు ప్రమాదకరంగా మారడంతో పాటు పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని వారు తెలిపారు. రాత్రి వేళల్లో ఈ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారే అవకాశం ఉండటంతో స్థానిక ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అలాగే రైతుబజార్‌లో పెద్ద ఎత్తున కూరగాయల వ్యాపారం నిర్వహించే దళారుల బండ్లు రాత్రి వేళల్లో నివాస ప్రాంతాల గుండా రావడం వల్ల స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా కూరగాయల వ్యాపారాన్ని బీట్ బజార్‌లోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో రైతుబజార్ కోసం మున్సిపల్ నుంచి 32 గుంటల స్థలం తీసుకున్న నేపథ్యంలో, దరూర్ క్యాంప్ ప్రాంతంలో మున్సిపాలిటీకి కేటాయిస్తామని మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపిన 5 ఎకరాల స్థలాన్ని ఇప్పటికైనా కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. శిధిలమైన క్వార్టర్లను సంబంధిత అధికారులు తక్షణమే పరిశీలించి, అవసరమైన భద్రతా చర్యలు చేపట్టి, సాధ్యమైన చోట వాటిని ప్రజోపయోగ కార్యక్రమాలకు వినియోగంలోకి తీసుకురావాలని కౌన్సిలర్ అరవ లక్ష్మి,-రాజు రాజు జిల్లా కలెక్టర్‌ను కోరారు.

# హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి

**చౌడేపల్లి సెప్టెంబర్ 21 :** అవును ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం అత్యంత శ్రేయోదాయకం మరియు తప్పనిసరి. ఇది ప్రమాదాల సమయంలో ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుంది. హెల్మెట్ ప్రాణ రక్షణ కవచమని పుంగనూరు రూరల్ సీఐ సాయి ప్రసాద్ సూచించారు. సోమవారం చౌడేపల్లి – పలమనేరు ప్రధాన రహదారిలోని చిట్రెడ్డిపల్లి వద్ద పోలీసు సిబ్బందితో కలిసి ఆకస్మిక వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న ప్రయాణికులను ఆపి, నిబంధనల ప్రకారం జరిమానాలు విధించారు. అనంతరం వారికి హెల్మెట్ వాడకంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ సాయి ప్రసాద్ మాట్లాడుతూ ప్రయాణంలో చిన్నపాటి నిర్లక్ష్యం కుటుంబాలకు తీరని శోకాన్ని మిగులుస్తుందని, ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటించాలని కోరారు. ద్విచక్ర వాహనం ఎక్కే ప్రతి ఒక్కరూ తమ భద్రత కోసం స్వచ్ఛందంగా హెల్మెట్ ధరించాలన్నారు.

# ఘనంగా ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలు

- పద్మశాలి సంఘం కుల బాంధవులు గ్రామ ప్రజలు.

**కోహెడ సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** సిద్ధిపేట జిల్లా కోహెడ మండలం బస్వాపూర్ గ్రామంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ వద్ద శ్రీ ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలు నిర్వహించారు కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ భానోత్ లింగం నాయక్ ఉప సర్పంచ్ తాటిపాముల ప్రవీణ్ మాజీఎంపీటీసీ బీ ఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొక్కుల సురేష్ మాజీ ఎంపీటీసీ కొక్కుల రమేష్ మాజీ సర్పంచ్ తాటిపాముల శ్రీనివాస్ పాల్గొని శ్రీ ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగానివాళు లర్పించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పోషించిన పాత్ర మరువలేనిదని1969 లో తొలి దశ పోరాటంలో కీలకపాత్ర పోషించి ఉద్యమ సమయంలో మంత్రి పదవిని సైతం త్యజించిన త్యాగశీలి అని, బాపూజీ తెలంగాణ ఉక్కు మనిషి అని ఆయన త్యాగాలను



కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు వేముల శ్రీనివాస్ అంబాటి శ్రీనివాస్ ఈగ శ్రీనివాస్ వేముల నరేష్ కొక్కుల బిక్షపతి కట్ల బాలమల్లు కొక్కుల భానుచందర్ బూర శ్రీశైలం, వేముల శ్రీపాల్ వేముల చందు గాదాసు భాస్కర్, బూర శ్రీనివాస్, బూర రమేష్, బూర సురేష్ తాటిపాముల తిరుపతి మాంకాల రమేష్ తాటిపాముల కనకయ్య సుధాగోని బుచ్చిరాజు సానది సింగరయ్య గంప రవి తాడం కనకయ్య సుధ గోని యాదగిరి తాటిపాముల రాజేష్ ఆదిమూల శ్రీహరి గ్రామ ప్రజలు తదితరులు అందరూ పాల్గొన్నారు.

# ప్రపంచమంతా శాంతి, సౌభ్రాతృత్వం విలసిల్లాలి

- జన విజ్ఞాన వేదిక జిల్లా సెక్రటరీ
- డా.అజయ్ కుమార్ రౌతు

**భీమదేవరపల్లి, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** ప్రపంచవ్యాప్తంగా శాంతి, సౌభ్రాతృత్వం, మానవతా విలువలు పరిఢవిల్లాలని జన విజ్ఞాన వేదిక (జేవీవీ) జిల్లా జనరల్ సెక్రటరీ డా.అజయ్ కుమార్ రౌతు ఆకాంక్షించారు. ప్రపంచ శాంతి దినోత్సవం సందర్భంగా జన విజ్ఞాన వేదిక భీమదేవరపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో వంగరలోని డా. పీవీ రంగారావు టీజీఆర్ఎస్‌డజేసీ వేదికగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డా. అజయ్ కుమార్ రౌతు మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో వ్యవహరించాలని అన్నారు. హింసకు బదులుగా సంభాషణ, సహకారం, సౌభ్రాతృత్వం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమానికి డా. పీవీ రంగారావు టీజీఆర్‌డజేసీ ప్రిన్సిపాల్ అఫ్రీన్ సుల్తానా అధ్యక్షత వహించారు. జేవీవీ కార్యదర్శి రమణచ బిక్షపతి, వలిహుస్సేన్ తదితరులు పాల్గొని ప్రపంచ శాంతి, సామాజిక ఐక్యత, మత సామరస్యం, మానవ విలువల ప్రాధాన్యతను వివరించారు. ప్రపంచ శాంతి దినోత్సవం సందర్భంగా




విద్యార్థులు, ఉపాధ్యాయులు, కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ శాంతి, సౌభ్రాతృత్వం, మానవతా విలువలను పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# ఆర్.టి.ఐ ఆవిర్భావ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ చేసిన జిల్లా అడిషనల్ కలెక్టర్

- ఆర్.టి.ఐ ఆవిర్భావ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ చేసిన జిల్లా అడిషనల్ కలెక్టర్ డి శ్రీనివాస్ రెడ్డి. డిఆర్ఓ స్వామి. ఆర్డీవో షర్మిల.

**కరీంనగర్ సెప్టెంబర్21 పీపుల్స్ డైరీ :** కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఆఫీసులో ఈరోజు సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజు ఆదేశాల మేరకు అలాగే రాష్ట్ర అధ్యక్షులు సూర ప్రవంతి ఆదేశాల మేరకు అక్టోబర్ 07/10/2026 హైదరాబాద్ (రవీంద్రభారతి)లో జరగబోయే సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆవిర్భావ దినోత్సవం అలాగే అవగాహన సదస్సు మీటింగ్ యొక్క పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం చేయడం జరిగింది కరీంనగర్ జిల్లా కన్వీనర్ బండ నరేందర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దాట్ల శ్రీనివాస్. ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ డి శ్రీనివాస్ రెడ్డి జిల్లా రెవెన్యూ ఆఫీసర్ స్వామి ఆర్డీవో



షర్మిల పోస్టర్ ఆవిష్కరించారు అనంతరం ఈ కార్యక్రమం విజయవం తంగా చేయడం జరిగింది ఈ కార్యక్రమం లో జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు దాట్ల శ్రీనివాస్ హుజూరాబాద్ నియోజకవర్గం అధ్యక్షులు తిరగమల్ల నాగార్జున జిల్లా నాయకులు మానకొండూరు నియోజకవర్గం అధ్యక్షులు బల్ల నాగరాజు మరియు నియోజకవర్గం కార్యదర్శిలు జాయింట్ సెక్రటరీలు మండల అధ్యక్షులు మండల కార్యనిర్వహక అధ్యక్షులు గ్రామ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ కోసం పదవిని త్యజించిన కొండా లక్ష్మణ్ బాపూజీ

## ఘనంగా బాపూజీ వర్ధంతి వేడుకలు

**హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) సెప్టెంబర్ 21** భారత స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ జాతిపిత, ఉద్యమ నాయకుడు, పద్మశాలి ముద్దుబిడ్డ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి వేడుకలను హుస్నాబాద్ పట్టణ, మండల చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం మార్కండేయ దేవాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కొండా లక్ష్మణ్ బాపూజీ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం ప్రజాప్రతినిధిగా శాసనసభ్యుడిగా, మంత్రిగా బాధ్యతలు నిర్వహించారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన తొలి దశ, మలిదశ ఉద్యమాల్లో ఆయన కీలకంగా పాల్గొన్నారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన మంత్రి పదవిని సైతం వదులుకుని ఉద్యమానికి అంకితమైన వ్యక్తిగా బాపూజీ చరిత్రలో నిలిచిపోయారని నాయకులు పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం తన రాజకీయ పదవిని త్యజించి పోరాటం కొనసాగించడం ఆయన నిబద్ధతకు నిదర్శనమన్నారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం, త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. పద్మశాలి, చేనేత వర్గాల అభ్యున్నతికి బాపూజీ చేసిన కృషిని నాయకులు స్మరించుకున్నారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల సాధన కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. బాపూజీ ఆశయాలను కొనసాగిస్తూ చేనేత రంగం అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హుస్నాబాద్ మండలం పద్మశాలి సంఘం అధ్యక్షుడు బూర్ల రాజయ్య, పట్టణ అధ్యక్షుడు కోమటి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కొండ సత్యనారాయణ,



మున్సిపల్ కౌన్సిలర్ కొండ రజిత, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డేపల్లి వెంకటరమణ, మహిళా విభాగం అధ్యక్షురాలు పంతం కన్యాకుమారి, వడ్డేపల్లి అరుణ, గోలి వెంకటనారాయణ, వడ్డేపల్లి లక్ష్మయ్య, వెల్దండి భాస్కర్, కోమటి నారాయణ, కొండి గణపతి, చిదురాల అశ్విని, పద్మశాలి, చేనేత కార్మిక సంఘ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


# ఆ వందల ఎకరాల్లో మా వాటా ఎక్కడుందో కేటీఆర్ చెప్పాలి: రమ్యారావు

## చెప్పులు కూడా లేని సంతోశ్ రావుకు వందల ఎకరాలు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్న



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకమైన ప్రజా పాలన అందిస్తుంటే, ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు 22ఏ పేరిట రాజకీయం చేస్తున్నారని కాంగ్రెస్ నాయకురాలు, కేసీఆర్ సొంత అన్న కూతురు రమ్యారావు మండిపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ కుటుంబం అడ్డగోలుగా ఆస్తులు దోచుకుందని ధ్వజమెత్తారు. గతంలోనే తమకు వందల ఎకరాల భూములు ఉన్నాయని ప్రకటనలు చేస్తున్న కేటీఆర్.. అందులో మా వాటా ఎక్కడుందో చెప్పాలని రమ్యారావు డిమాండ్ చేశారు. మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోశ్ రావు కేటీఆర్‌కు బినామీ కాబట్టే ఆయన ఆస్తులపై ప్రశ్నించకుండా మౌనంగా ఉంటున్నారా? అని ప్రశ్నించారు. గతంలో చెప్పులు వేసుకునే పరిస్థితి కూడా లేని సంతోశ్ రావుకు బంజారాహిల్స్ రోడ్ నంబర్ 14లో భవనం, కొండాపూర్, మార్కుక్ ప్రాంతాల్లో వందల ఎకరాల భూములు, నానక్‌రామ్‌గూడలో ఆయన భార్య రోహిణి పేరిట భారీ కమర్షియల్ భవనాలు ఎలా వచ్చాయని నిలదీశారు. ప్రాజెక్టుల ముంపు పేరుతో కుదురుపాక గ్రామానికి సంబంధం లేని సంతోశ్ కుటుంబ సభ్యులు అక్రమంగా 8 ఇళ్ల ప్లాట్లను పొందారని, అయితే 2018 రాజ్యసభ అఫిడవిట్‌లో కేవలం ఒక్క ప్లాట్‌ను మాత్రమే చూపి సమాచారాన్ని దాచారని ఆరోపించారు. కేసీఆర్ దగ్గర ఉంటూ అడ్డగోలుగా సంపాదించిన సంతోశ్ రావును వెనకేసుకొస్తూ... కవితను, ఇంటి నుంచి బయటకు పంపిన వైనంపై కేటీఆర్ సమాధానం చెప్పాలని రమ్యారావు సవాల్ విసిరారు.

# గణనాథులకు జువ్వాడి కృష్ణారావు ప్రత్యేక పూజలు



**కోరుట్ల :** కోరుట్ల పట్టణంలోని పలు గణేశ్ మండపాలను రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు సందర్శించి గణనాథులకు పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత–గంగాధర్ తో కలిసి 23వ వార్డులో బెజ్జరపు భరద్వాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం, టీచర్స్ క్లబ్ రోడ్డులో ఛాంపియన్స్ యూత్ ఆధ్వర్యంలోని మండపం, జవహర్ రోడ్డులో వైశ్య సంఘం ఆధ్వర్యంలోని మండపాన్ని సందర్శించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, కాంగ్రెస్ నాయకులు పుప్పాల ప్రభాకర్, ఎడ్ల రమేష్, చిట్టిమిల్లి రంజిత్ గుప్తా, ఎంబేరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# రక్తదానంలో కన్నె రాజుకు ఉత్తమ సేవా పురస్కారం

**మట్టెవాడ, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** వరంగల్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏ.ఆర్. పోలీస్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న బ్లడ్ డోనర్ మోటివేటర్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు) రక్తదానంలో ఉత్తమ సేవా పురస్కారం -- 2026"ను అందుకున్నారు. ?వరంగల్ జిల్లా ఖానాపురం మండలం రాగంపేట గ్రామానికి చెందిన కన్నె కుమారస్వామి -- రమనీల దంపతుల పెద్ద కుమారుడైన కన్నె రాజు గత 21 సంవత్సరాలుగా సామాజిక సేవ కార్యక్రమాలతో పాటు అత్యవసర రోగులకు 18,832 మందికి ఉచిత రక్త సహాయం అందచేశారు. భారత్ రక్తదాన్ సేవా మిషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ మండలంలోని పిఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వివిధ రంగాలలో ఉత్తమ సేవలు అందించిన రక్తదాతలు, సమాజ సేవకులు, ఉపాధ్యాయులకు ఈ ఉత్తమ సేవా పురస్కారాలను అందచేశారు. ఈ సందర్భంగా కన్నె రాజు మాట్లాడుతూ తనకు అన్ని విధాలుగా సహకరిస్తూ నిరంతరం ప్రోత్సహిస్తున్న ప్రతి ఒక్కరికీ ఈ పురస్కారాన్ని అంకితం చేస్తున్నానని తెలిపారు.



# కొండా లక్ష్మణ్ బాపూజీకి బీజేపీ ఘన నివాళులు

**మట్టెవాడ, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** బీసీల ఆరాధ్యుడు స్వర్గీయ కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా సోమవారం ఉదయం బిజెపి ఓబీసీ మోర్చా వరంగల్ జిల్లా అధ్యక్షులు కూచన క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో వరంగల్ నగరం లోని కొత్తవాడ జంక్షన్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర నాయకులు కుసుమ సతీష్ హాజరై వారి విగ్రహానికి పూలమాల వేసి, కొండా లక్ష్మణ్ బాపూజీ మూడు తరాల ఉద్యమ స్ఫూర్తి ప్రదాత అని వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు బైరి మురళీకృష్ణ, ముంద్రాతి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు బైరి శ్యాంసుందర్, మాచర్ల దీన్ దయాల్, చిలువేరు రాజేందర్ గాజుల సంపత్, కోమాకుల నాగరాజు, గుర్రపు సత్యనారాయణ, కోట సతీష్ కొంతం సంగీత్, సామల నిరంజన్, బొడ్డు రాకేష్, అల్లి అజయ్, కందగట్ల మల్లికార్జున్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల వినతులకు సత్వర పరిష్కారం అందించాలి



**మట్టెవాడ, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ):** ప్రజల నుంచి అందే ఫిర్యాదులకు సత్వర పరిష్కారం అందించాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వెంకన్న అన్నారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య స్వభావానికి అనుగుణంగా సంబంధిత విభాగాలకు బదలాయించారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యాన్ని ఎంతమాత్రం సహించబోమని అధికారులను ఆయన హెచ్చరించారు. అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. గత వారం ప్రజావాణిలో స్వీకరించిన వినతుల పరిష్కార స్థితిగతులను కమిషనర్ విభాగాల వారీగా సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను తక్షణమే పరిష్కరించడంతో పాటు, తీసుకున్న చర్యలను సంబంధిత ఫిర్యాదుదారులకు తెలియచేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సూపరింటెండింగ్ ఇంజినీర్ రాజ్‌కుమార్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, సమ్మయ్య, సెక్రెటరీ అనిల్‌బాబు, హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి, పన్నుల అధికారి రామకృష్ణ అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సూపర్ స్పెషాలిటీ పనులను వేగంగా పూర్తి చేయాలి

## ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టియాన ఆదేశాలు



**మట్టెవాడ, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ):** వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జె. చోంగ్తూ, ఐఏఎస్, వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ వాణి సోమవారం వరంగల్‌లోని నూతనంగా నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ముఖ్య కార్యదర్శిని మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైద్య, ఆరోగ్య శాఖకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని సందర్శించి నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులోకి రానున్న వైద్య సదుపాయాలు, మౌలిక వసతులు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేసేలా సంబధిత శాఖల సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ సందర్శనలో సంబంధిత శాఖల అధికారులు వారి వెంట ఉన్నారు.

# ఏఐకేఎంఎస్ నాలుగవ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి



**మట్టెవాడ, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ):** ఈనెల 28 29 30 తేదీలలో ఖమ్మం జిల్లా కేంద్రంలో అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నాల్గవ జాతీయ మహాసభలు జరుగుతాయని సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు తెలిపారు. సభలను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం వరంగల్ గ్రైన్ మార్కెట్ సెంటర్లో నాయకులు పోస్టర్ ను ఆవిష్కరించారు. 28వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు పెవిలియన్ గ్రౌండ్ నుండి ప్రజా ప్రదర్శన ఉంటుందని, మధ్యాహ్నం రెండు గంటలకు ఎస్సార్ అండ్ బిజీఎన్ఆర్ కాలేజ్ గ్రౌండ్ లో బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ సభకు ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షులు వేములపల్లి వెంకట్రామయ్య అధ్యక్షత వహిస్తారని జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆశిష్ మిట్టల్, ఉపాధ్యక్షులు జితేందర్ సింగ్, సుశాంత్ ఝా, తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వి.కోటేశ్వరరావు, అధ్యక్ష కార్యదర్శులు మామిడాల బిక్షపతి గౌని ఐలయ్యలతోపాటు ఒడిస్సా, పశ్చిమబెంగాల్, ఉత్తర ప్రదేశ్, పంజాబ్, బీహార్, అస్సాం తదితర రాష్ట్రాల నాయకులు ప్రసంగిస్తారని తెలిపారు. 29,30 తేదీలలో ఎస్.ఆర్ కన్వెన్షన్ హాలులో ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ మనోరంజన్ మహంతి ప్రారంభ ఉపన్యాసం చేస్తారని మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ గోపీనాథ్ తొలిపలుకులు ఇస్తారని ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వేణు ప్రసంగిస్తారని ఆయన తెలిపారు. సభలను జయప్రదం చేయాలని రైతు కూలీలతో పాటు వివిధ వర్గాల ప్రజలను ఆయన కోరారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి బండి వెంకటేశ్వర్లు ఐఎఫ్.టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్, సహాయ కార్యదర్శి బండి కుమార్, పోతరాజు రాజు, జక్కుల రమేష్, ఓర్సు సుధాకర్, చేరాలు, శంకర్, భాస్కర్, రాజు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# వెంటిలేటర్‌పై వరంగల్ ప్రభుత్వ పెద్దాసుపత్రి 'ఎంజీఎం' దుస్థితి....

**మట్టెవాడ, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** ఉత్తర తెలంగాణకే తలమానికమైన, వరంగల్ నగరంలోని అతిపెద్ద ప్రభుత్వ ఆసుపత్రి అయిన ఎంజీఎం ఆసుపత్రి ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనం వల్ల వెంటిలేటర్‌పై కొట్టుమిట్టాడుతోందని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ధ్వజమెత్తారు. ఆదివారం ఎంజీఎం ఆరోగ్యశ్రీ వార్డులో ఆస్పత్రి పైకప్పు పెచ్చులు ఊడిపడటంతో గాయపడి చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులను పరామర్శించేందుకు బీజేపీ నాయకులతో గంట రవికుమార్ ఎంజీఎంకి చేరగా, ఆసుపత్రి ప్రాంగణంలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసు కుంది. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లకుండా అడ్డుకోవాలని చూసిన పోలీసులతో బీజేపీ నాయకులకు మొదటగా తీవ్ర వాగ్వాదం జరిగింది. పోలీసుల ఆంక్షలను ధిక్కరిస్తూ బీజేపీ శ్రేణులు ప్రమాదం జరిగిన ఆరోగ్య శ్రీ వార్డు ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ సా, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, గోకే వెంకటేష్, వెంకట్ రావు, టేకుమట్ల రేణుక, కూచన క్రాంతి కుమార్, ఎర్రగోళ్ల భరత్ వీర్, అంకాల జనార్ధన్, బైరి శ్యాంసుందర్, నోముల రతన్, గోగికార్ అనిల్, చిలువేరు రాజేందర్, మాచర్ల దీన్ దయాల్, గుర్రాల చంద్రమౌళి, గడ్డం మహేందర్, కర్నే రవీందర్, మందో టి మహేందర్, షేర్ల అనిల్, కోమాకుల నాగరాజు, మడిపల్లి నాగరాజు, మార్త ఉషారాణి, స్వర్ణజ, శైలశ్రీ, సుజాత, మహమ్మద్ రఫీ, సీతా నాగరాజు, రజనీష్, తాళ్లపల్లి శ్రీనివాస్‌పాల్గొన్నారు.





# అన్నప్రసాదంలో పాల్గొన్న కౌన్సిలర్ శ్రీదేవి శ్రీనివాస్

**నర్సంపేట, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** 26వ వార్డు పరిధిలో వేర్వేరు చోట్ల వినాయక మండపంలో జరిగిన అన్నప్రసాద కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ మండల శ్రీదేవి శ్రీనివాస్ హాజరయ్యారు. వార్డులోని జిఆర్‌గార్డెన్ సమీపంలో వాసవి కళ్యాణమండపం రోడ్డులోని రైతు బజార్ దగ్గరలో ఏర్పాటుచేసిన గణపతి వినాయక ఉత్సవ కమిటీల వారు మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ఉత్సాహ కమిటీ సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ వార్డ్ అధ్యక్షుడు గుండెబోయిన శివకోటి వేల్పుల శ్రీను వేల్పుల కన్నయ్య వేల్పుల సాంబయ్య బండి వేణు దోనాల రవి దోర్నాల శ్రీధర్ సంఘ రమేష్ అడుప రాంబాబు వేల్పుల సాయి తేజ కొమ్మ శ్రీధర్ నీరటి రంజిత్ చల్ల కర్ణాకర్ బండి సన్నీ కొమ్మ స్వరూప నాడెం ఇంద్ర కళ్ళెపు నీరాజ, కాగితపు విష్ణు, చెల్పూరు శ్రీను పుట్టపాక సాయిలు బ్రాహ్మణపెల్లి సుమన్, వేణు, మండల సంతోష్,దండు ఐలయ్య, లింగమూర్తి అందే నాగరాజు స్థానిక భక్తులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయికి శ్రీ వివేకవర్ధిని విద్యార్థుల ఎంపిక



**కేసముద్రం, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని పెనుగొండ గ్రామంలో ఈ నెల 18, 19 తేదీలలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ఐ జోనల్ స్థాయి క్రీడా పోటీలలో మహమూదుపట్నం శివారులోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కబడ్డీ అండర్-17 విభాగంలో భూక్య విజయ్, అండర్-14 విభాగంలో భూక్య మోహన్, అజ్మీరా జ్ఞానేశ్వర్, కోకో అండర్-17 విభాగంలో వాంకుడోత్ భరత్, కుండే ప్రణయ్, వాంకుడోత్ నగేశ్, కోకో అండర్-14 విభాగంలో బానోత్ అనిరుద్, గుగులోతు నవదీప్, వాలీబాల్ అండర్-14 విభాగంలో చిలుకూరి శ్రీచందు, సపావట్ మోహన్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్, ప్రిన్సిపల్ చిర్ర నరేశ్ విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చిర్ర యాకాంతం గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించడం పాఠశాలకు గర్వకారణమన్నారు. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని, జిల్లా స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబర్చి పాఠశాలకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయాల వెనుక ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకుల కృషి ఎంతో ఉందని కొనియాడారు.

# పోలీసులమంటూ బంగారు వ్యాపారులకు డిజిటల్ అరెస్ట్ బెదిరింపులు..

## నల్గొండకు చెందిన ఇద్దరు సైబర్ నేరగాళ్లు అరెస్ట్




**కేసముద్రం, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** కేసముద్రం పోలీసులు సైబర్ నేరగాళ్ల ఆటకట్టించారు. పోలీసులుగా నటిస్తూ బంగారు వ్యాపారులను డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న నల్గొండ జిల్లా నిడమనూరుకు చెందిన షేక్ ఇర్ఫాన్, చింతలచేరువు ప్రశాంత్ లను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ డా. శబరీష్ తెలిపారు. నిందితుడు షేక్ ఇర్ఫాన్ పోలీస్ యూనిఫాం ధరించి ఫోటో తీసుకుని వాట్సాప్, ట్రూకాలర్‌లలో డీపీగా పెట్టుకొని మోసాలకు పాల్పడుతున్నాడు. కేసముద్రం మండలానికి చెందిన బంగారు వ్యాపారి బోగోజు వేణుగోపాల చారి నంబర్‌ను గూగుల్ ద్వారా సేకరించి ఈ నెల 10వ తేదీన ఫోన్ చేసి తాను వికారాబాద్ సమీపంలోని పార్వతీపురం పోలీస్ స్టేషన్ ఎస్ఐని అని, ఇద్దరు దొంగలను పట్టుకున్నామని, వారు దొంగిలించిన బంగారాన్ని మీరు కొనుగోలు చేశారని, రసీదు లు తమ వద్ద ఉన్నా యని బెదిరించాడు. బంగారం రికవరీగా ఇవ్వకపోతే వచ్చి అరెస్ట్ చేస్తామని, పరువు పోతుందని భయపెట్టి వాట్సాప్ ద్వారా క్యూఆర్ కోడ్ పంపి 88 వేల 26 రూపాయలు వసూలు చేశాడు. దీనిపై బాధితుడు కేసముద్రం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ వై. సత్యనారాయణ, ఎస్ఐ కె.క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో సాంకేతిక ఆధారాలు, సైబర్ క్రైమ్ పోర్టల్, బ్యాంక్ స్టేట్మెంట్లను విశ్లేషించి ఈనెల 20న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. విచారణలో వీరు గత నెల రోజుల్లోనే తెలుగు రాష్ట్రాల్లోని బంగారు వ్యాపారుల ను ఇదే విధంగా బెదిరించి సుమారు 4 లక్షల 20 వేల రూపాయల వరకు వసూలు చేసినట్లు తేలింది. గతంలో కూడా నల్గొండ, ఆదిలాబాద్, ఎచ్చోడ, కట్టంగూర్, తిరుమలగిరి, రామగుండం, బిక్కనోలు పోలీస్ స్టేషన్లలో వీరిపై పలు కేసులు నమోదై జైలుకు వెళ్లి వచ్చినా మళ్ళీ అదే నేరాలకు పాల్పడు తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి మొబైల్ ఫోన్, పోలీస్ యూనిఫాం స్వాధీనం చేసుకు న్నారు. పోలీసుల పేరుతో వచ్చే ఫోన్ కాల్స్, డిజిటల్ అరెస్ట్ బెదిరింపులను నమ్మవద్దని, ఎవరైనా మోసపోతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని ఎస్పీ ప్రజలకు సూచించారు.






# ప్రశాంతంగా గణపతి నిమర్జనాన్ని విజయవంతం చేయాలి

## వేముల సాంబయ్య గౌడ్

**నర్సంపేట, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని మాదన్నపేట చెరువు కట్టపై ఈనెల 23న జరగబోయే గణపతి నిమజ్జనం కార్యక్రమాలకు మున్సిపాలిటీ సిబ్బంది చేస్తున్నటువంటి శుభ్రత పనులను జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వేముల సాంబయ్య గౌడ్, ఏరియా కౌన్సిలర్ ముత్తినేని వెంకటేశ్వర్లు, ఎన్ఎస్‌యుఐ పట్టణ అధ్యక్షులు కటారి ఉత్తమ్ కుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వేముల సాంబయ్య గౌడ్ మాట్లాడుతూ ఈనెల 23న జరగబోయే నిమజ్జనం కార్యక్రమాల్లో ఊరేగింపులు నిమజ్జనం కార్యక్రమానికి తీసుకొచ్చే గణనాథులతో చిన్నపిల్లలను తీసుకురాకుండా, పెద్దలు మద్యం సేవించకుండా నియామ నిష్టలతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ జవాన్లు కందిక స్వామి గోపగోని ప్రభాకర్ రమేష్, మహేందర్ మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు

# క్రీడాకారులను అభినందించిన మున్సిపల్ చైర్‌పర్సన్

**నర్సంపేట, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** ఈనెల 17, 18, 19 తేదీలలో గురజాల ఉన్నత పాఠశాలలో జరిగిన 70వ ఎస్‌జిఎఫ్ఐ నర్సంపేట జోనల్ లెవెల్ క్రీడోత్సవాలలో జెడ్‌పిహెచ్ఎస్ బాయ్స్ నర్సంపేట పాఠశాలకు చెందిన క్రీడాకారులు కబడ్డీ ఖోఖోలో గెలుపొందినారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు లిక్కి రమేష్ కుమార్ తెలిపారు. అండర్ 14 ఇయర్స్ కబడ్డీ బాలుర విభాగంలో ప్రథమ స్థానం స్థానం సాధించారు. ఖో-ఖో అందరు 14 బాలుర విభాగంలో ద్వితీయ స్థానం సాధించారు. ఖో ఖో అండర్ 14 బాలికల విభాగంలో ద్వితీయ స్థానం సాధించారు. ఖో-ఖో అండర్ 17 ఇయర్స్ బాలికల విభాగంలో ద్వితీయ స్థానం సాధించి జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ పెండం లక్ష్మీ రామానంద్ క్రీడాకారులను అభినందించారు.






# ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

## అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు జక్కుల తిరుపతి

**నర్సంపేట, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** సెప్టెంబర్ 28, 29, 30 తేదీలలో ఖమ్మంలో జరుగు అఖిల భారత రైతు-కూలీ సంఘం ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభల పోస్టర్ ను దుగ్గొండి మండలంలోని గిరినిబావి సెంటర్లో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు-కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) జిల్లా అధ్యక్షులు జక్కుల తిరుపతి, మాట్లాడుతూ.. అఖిల భారత రైతు-కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నాలుగవ జాతీయ మహాసభను జయప్ర దం చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు గుర్రం అజయ్ మాట్లాడుతూ ఖమ్మంలో ఈ నెల 28న వేలాది మందితో భారీ ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ ప్రదర్శన, బహిరంగ సభలో ప్రజలు, రైతు కూలీలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏ ఐ కేఎంఎస్ మండల నాయకులు బాదావత్ సుమన్, సమ్మక్క, రాజు, బద్రు, తదితరులు పాల్గొన్నారు.

# అర్పణపల్లి స్కూల్ దగ్గర డ్రైనేజీ మధ్యలో కరెంట్ స్తంభం..

## విద్యార్థుల ప్రాణాలతో అధికాకరుల చెలగాటం



**కేసముద్రం, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** కేసముద్రం మండలం అర్పణపల్లి గ్రామంలోని స్కూల్ దగ్గర అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. పిల్లలు రాకపోకలు సాగించే పాఠశాల సమీపంలోనే నూతన డ్రైనేజీ మధ్యలో కరెంట్ స్తంభం ఉండటంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అర్పణపల్లి స్కూల్ దగ్గర కొత్తగా డ్రైనేజీ కాలువ నిర్మిస్తున్నారు. అయితే కాలువకు అడ్డుగా ఉన్న కరెంట్ స్తంభాన్ని పక్కకు జరపకుండానే కాంట్రాక్టర్ పనులు కొనసాగిస్తున్నారు. స్తంభం చుట్టూనే శ్లాబ్ లు వేసి నిర్మాణం చేస్తున్న ఫోటో చూస్తే అధికారుల నిర్లక్ష్యం ఎలా ఉందో అర్థమవుతుంది. స్కూల్‌కు వెళ్లే చిన్నారులు ప్రతిరోజూ ఇదే దారిలో నడుస్తుంటారు. వర్షం వస్తే డ్రైనేజీలో నీరు నిలిచి కరెంట్ స్తంభంలోకి పాకితే షాక్ కొట్టి పెను ప్రమాదం జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు భయపడుతున్నారు. అధికారులు కేవలం కమీషన్లకు కక్కుర్తి పడి నాణ్యత లేకుండా పనులు చేయిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా విద్యాశాఖ, పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి స్కూల్ దగ్గర ఉన్న ఆ ప్రమాదకర కరెంట్ స్తంభాన్ని వెంటనే తొలగించి విద్యార్థులకు రక్షణ కల్పించాలని తల్లిదండ్రులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



## కొండా లక్ష్మణ్ బాపూజీ పోరాటం స్ఫూర్తిదాయకం

### కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి

**శాయంపేట, సెప్టెంబర్ 21,(పీపుల్స్ డైరీ) :** తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ కోసం జీవితాంతం పోరాడిన ఉద్యమ నేత, స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని పేర్కొన్నారు. బాపూజీ సేవలు, త్యాగాలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దుబాసి కృష్ణమూర్తి, బాసాని రవి, మారపల్లి రాజేందర్, వరదరాజు, వడ్డేపల్లి శ్రీనివాస్, వినుకొండ శంకరాచారి, అంకేశ్వరపు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ధరణి దంధాతో కోట్లకు అధిపతులు

### కాంగ్రెస్ పార్టీ నాయకులు మెరుగు సురేష్ గౌడ్



**మొగుళ్ళపల్లి, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ ఉద్యమ సమయంలో పెట్రోలుకు, డీజిల్‌కు కూడా పైసలు లేవన్న కేసీఆర్ కుటుంబం ధరణి ధందా తో వందల కోట్ల ఆస్తులకు అధిపతులు అయ్యారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మెరుగు సురేష్ గౌడ్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలకు మద్దతుగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటు సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని మిగులు బడ్జెట్ తో అప్పగిస్తే, 10 ఏళ్లలో కేసీఆర్ కుటుంబం తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిందని విమర్శించారు. ఉద్యమంలో బండి తిప్పడానికి పెట్రోలుకు డబ్బులు లేవని చెప్పిన వాళ్లు, ఇవాళ ఫాంహౌజులు, ప్రైవేట్ కంపెనీలు, బినామీ ఆస్తులతో వందల కోట్లకు పడగలెత్తారని. ఈ డబ్బు ఎక్కడి నుండి వచ్చిందని ప్రశ్నించారు.

## వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



**గణపురం, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండల కేంద్రంలోని గణపసముద్రంలో వినాయక నిమజ్జనానికి చేపడుతున్న ఏర్పాట్లను గణపురం, బుర్రకాయలగూడెం సర్పంచులు కట్కూరి రాధిక శ్రీనివాస్, తుమ్మల సంపత్ సోమవారం పరిశీలించారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆదేశాల మేరకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి నిమజ్జన ప్రదేశాన్ని సందర్శించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలు, భద్రత తదితర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గణపురం సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్, బుర్రకాయల గూడెం సర్పంచ్ తుమ్మల సంపత్, ఉప సర్పంచ్ ఓరుగంటి కృష్ణ గౌడ్, మాజీ ఎంపీటీసీ కలియ సాగర్, మాజీ కోఆప్షన్ సభ్యుడు మమ్మద్ చోటేమియా, వార్డు సభ్యుడు తిక్క సంపత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బోనాల రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు



**శాయంపేట, సెప్టెంబర్ 21,(పీపుల్స్ డైరీ) :** వినాయక నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని శాయంపేట మండలంలో భద్రతా ఏర్పాట్లను మండల స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రగతి సింగారం వద్ద గల చలివాగు ప్రాజెక్టు బ్రిడ్జి, అలాగే శాయంపేట గ్రామ పరిధిలోని దేవుని చెరువు, తాళ్ళ కుంటలను అధికారులు పరిశీలించి, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై సమీక్షించారు. నిమజ్జన ప్రాంతాల వద్ద ప్రమాదాలు జరగకుండా బారికేడ్ల ఏర్పాటు, తగినంత వెలుతురు కోసం విద్యుత్ దీపాలు, క్రేన్ల ఏర్పాటు,పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టాలని సమీక్షించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో సీఐ సుధాకర్ రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ పరమేశ్వర్, ఎంపీడీవో ఫణి చంద్ర, టీజీఎన్పీడీసీఎల్ ఏఈ చొక్కారావు తదితరులు పాల్గొన్నారు. ఉత్సవ కమిటీలు, నిర్వాహకులు పోలీసు , రెవెన్యూ శాఖల నిబంధనలను పాటిస్తూ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేయాలని కోరారు.

## రక్తదాన శిబిరంలో గణపురం బీజేపీ నాయకులు



**గణపురం, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. భారతీయ జనతా యువమోర్చా భూపాలపల్లి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గణపురం మండలానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడు నూతుల నిశిదర్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నె మొగిలి, లింగంపల్లి ప్రసాద్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో గణపురం మండల ఇన్చార్జి జిల్లా కార్యదర్శి శివనాత్రి వేణు, బిజెపి గణపురం మండల కన్వీనర్ మంద మహేష్, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు ఉడుత నాగరాజు, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుప్పటి భద్రయ్య, మండల నాయకులు ఊర నవీన్ రావు, వడ్డేం రాజ శేఖర్, గొర్రె రవి, మొలుగురి సుజన్, గద్దెల హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం మండల కమిటీ ఎన్నిక

### అధ్యక్షుడిగా గుజ్జ గంగాధర్ రావు

**గణపురం, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన గుజ్జ గంగాధర్ రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఫోరం రాష్ట్ర సహాయ కార్యదర్శి మండల రవీందర్ రెడ్డి,నియోజక కన్వీనర్ పైడిపల్లి రమేష్,రాష్ట్ర నాయకులు పున్నం రవి ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ ఉద్యమకారుల సర్వసభ్య సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుజ్జ గంగాధర్ రావు, ప్రధాన కార్యదర్శిగా ఎండి మహబూబ్ పాషా, ఉపాధ్యక్షులుగా రేపాక రాజేందర్, ఆకుల తిరుపతి, చేగుండ సంపత్, నగావత్ కిషన్, కార్యదర్శులుగా బోయిని సాంబయ్య, పెంట చిరంజీవి, పొట్ల కిష్టయ్య, సహాయ కార్యదర్శి లుగా కొత్తపెల్లి కుమార్ స్వామి, ఆకుల కట్టయ్య, ప్రచార కార్యదర్శులుగా ల్యాదల్ల శంకర్, కోశాధికారిగా గాదె శేఖర్, కార్యవర్గ సభ్యులుగా తాళ్ల హరి ప్రసాద్, బాలకృష్ణ కదారి, బిక్షపతి, యూత్ మండల అధ్యక్షులుగా పాసికంటి రామకృష్ణ ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గుజ్జ గంగాధర్ రావు మాట్లాడుతూ... తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సెప్టెంబర్ 27న యాదగిరిగుట్టలో జరిగే తెలంగాణ ఉద్యమకారుల ఫోరం 9వ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ గోడపత్రికను ఆవిష్కరించారు. ఉద్యమకారులందరూ ఈసభను విజయవంతం చేయాలనీ గంగాధర్ రావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కసిరెడ్డి వెంకటరమణా రెడ్డి, కటుకూరి శ్రీనివాస్, మోటపోతుల శివశంకర్ గౌడ్, ముత్యాల రాజయ్య, రేగూరి లక్ష్మారెడ్డి, మామిండ్ల మల్లికార్జున్ గౌడ్, అల్లూరి శ్రీను, దొగ్గల దేవేందర్, డాక్టర్ జన్నయ్య, మేకల రాజకుమార్, బైరగాని కుమార స్వామి గౌడ్, మోటపోతుల చందర్ గౌడ్, కంకణాల సమ్మిరెడ్డి, ఈర్ల రాజు, ఎండి ఖలీల్, జూకాంటి మధు, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



## ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**గణపురం, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండల కేంద్రంలోని వివిధ పాఠశాలల్లో ఉత్తమ ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న వారిని సోమవారం అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు శనిగరపు రాజేందర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గణపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ దేశు సతీష్‌కు ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు, ఫిజికల్ డైరెక్టర్ సరితకు ఉత్తమ ఫిజికల్ డైరెక్టర్ అవార్డు రావడంతో వారిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అలాగే ఆదర్శ మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ తిరుపతికి ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు రావడంతో సన్మానించారు. కేజీబీవీ పాఠశాల సోషల్ టీచర్ డి.విజయలక్ష్మికి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు రావడంతో పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు తిక్క సంపత్, అంబేద్కర్ యువజన సంఘం వ్యవస్థాపకులు కట్ల శంకరయ్య, ఉపాధ్యాయ సంఘాల డిటిఎఫ్ మండల అధ్యక్షులు సిహెచ్ రాంబాబు, యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పరికి రమేష్, చిలువేరు ఉదయాకర్, మైనార్టీ మండల నాయకులు ఎండి సైదులు పాషా, రజక సంఘం జిల్లా యూత్ అధ్యక్షులు పసునూటి శంకర్, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వివాహిత అదృశ్యం



**చిట్యాల, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని నైన్ పాక గ్రామానికి చెందిన పెరుమాండ్ల లక్ష్మి (30) అనే వ్యవసాయ కూలీ అదృశ్యమైన ట్లు చిట్యాల పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే నైన్ పాక గ్రామానికి చెందిన పెరుమాండ్ల దేవేందర్ కు లక్ష్మికి పదేళ్ల క్రితం వివాహం జరిగింది. ఈనెల 20న ఉదయం దేవేందర్ పనికి వెళ్లగా ఉదయం 10 గంటల సమయంలో లక్ష్మి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సాయంత్రం పని నుండి తిరిగి వచ్చిన భర్త చుట్టుపక్కల వెతికినా ఆమె ఆచూకీ దొరకలేదు. దీంతో తన భార్య కనబడటం లేదని తెలుపుతూ భర్త దేవేందర్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదృశ్యమైన సమయంలో ఆమె ఆకుపచ్చ రంగు చీర ధరించి ఉంది. ఆమె ఛాయ నలుపు గుండ్రని ముఖంతో సుమారు 150 సెం.మీ ఎత్తు ఉంటుంది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల ఎస్సై పోచంపల్లి సతీష్ తెలిపారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు మొబైల్ నెంబర్ 8712658124కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

## బాధిత కుటుంబానికి సమ్మిగౌడ్ చేయూత



**కేసముద్రం, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన ముదిరాజ్ కుల సంఘం సభ్యుడు మొలకల సారయ్య ముదిరాజ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలువేరు సమ్మిగౌడ్ పరామర్శించారు. టీపీసీసీ సభ్యులు గుగులోతు దస్రు నాయక్ తో కలిసి శనివారం బాధిత కుటుంబాన్ని కలిసి వారిని ఓదార్చారు. కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. సారయ్య పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారి ఉన్నత చదువులకు తన వంతు సహాయం అందిస్తానని సమ్మిగౌడ్ హామీ ఇచ్చారు. అంతేకాకుండా దశదిన కర్మ కార్యక్రమాల కోసం 50 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను టీపీసీసీ సభ్యులు దస్రునాయక్ చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపద లో ఉన్న కుటుంబాన్ని పలకరించి మాటలకే పరిమితం కాకుండా అవసరమైన సమయంలో ఆదుకున్న చిలువేరు సమ్మిగౌడ్ కు కాట్రపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ చాగంటి యాదగిరి, గ్రామ కమిటీ అధ్యక్షుడు జల్లె ఏకాంబరం, ఉపాధ్యక్షుడు పుట్ట ప్రభాకర్, మండల ఉపాధ్యక్షుడు జాటోత్ లక్ష్మణ్, వార్డు సభ్యులు కాలేపాక కలమ్మ, లక్ష్మయ్య, కర్పూరపు వెంకటేశ్వర్లు, సాంబారి వీరస్వామి, బోదాసు చంద్రయ్య, అడప రవీందర్, శీలం యాదగిరి, దెబ్బట సూరయ్య, కుంచం మునీందర్, కాలేపాక కృష్ణవేణి, వంశీ, ఏఐడీఎఫ్ నాయకులు గడ్డం నాగార్జున, బాదావత్ నరేష్, ఆంగోతు శివ, జాటోత్ లాల్ సింగ్, గూగులోత్ సురేష్, ఆంగోతు వీరు, పోలేపాక శ్రీనివాస్, గుండెపాక మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాదం వితరణ



**మొగుళ్ళపల్లి, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలో గణపతి నవరాత్రుల ఉత్సవాలను. అత్యంత భక్తి శ్రద్ధలతో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 8 వ రోజు సోమవారం ఆది దేవుడు మహా గణపతికి ఆలయ ప్రధాన అర్చకులు బైరవభట్ల వెంకటేశ్వర శర్మ, విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం దాతల సహకారంతో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాదం వితరణ చేశారు. మహా అన్నదాన కార్యక్రమం ఉత్సవ కమిటీ అధ్యక్షులు క్యాతరాజు రమేష్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ చాట్ల విజయ రవీందర్, ఉపసర్పంచ్ ఎర్రబెల్లి హిమబిందు కోటేశ్వరరావు, గ్రామ పాలక వర్గం మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు దేవునూరి కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి గడ్డం రవీందర్, ఎల్దండి ప్రకాశం, ఏలేటి శివారెడ్డి, బత్తిని రాజు, వీణవంక నవీన్, అన్నారపు కుమారస్వామి, తిప్పారపు సురేందర్, దేవనూరి అశోక్, సూర్నేని మణికర్, బత్తిని రమేష్, క్యాతరాజు రాజయ్య, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## భూముల రీ సర్వే ప్రారంభం



**చిట్యాల, సెప్టెంబర్ 21 (పీపు ల్స్ డైరీ) :** మండలంలోని చల్లగరిగ గ్రామంలో సోమవారం భూముల రీ సర్వే ప్రారంభమైనట్లు మండల తాసిల్దార్ వసంతరావు తెలిపారు. ఈ సందర్భంగా తాసీల్దార్ మాట్లాడుతూ మొదటగా గ్రామం సరిహద్దులు నిర్ణయించుట జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చల్లగరిగ గ్రామ సర్పంచ్ సిరిపెల్లి జంపయ్య, వార్డు సభ్యులు గ్రామ పెద్దలు రైతులు జూకల్ గ్రామ శివారు రైతులు మండల సర్వేయర్ గ్రామ జిపిఓ జూకల్ గ్రామ జిపిఓ, ఇతర జిపిఓలు పాల్గొన్నారు.

## ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ మండల కమిటీ ఎన్నిక

**మొగుళ్ళపల్లి, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** మండల ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మొగుళ్లపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో. అసోసియేషన్ బలోపేతానికి, వ్యాపారులు, రైతుల సంక్షేమానికి కృషి చేసేందుకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ప్రకటించారు. నూతన అధ్యక్షులుగా లింగంపల్లి తిరుపతి ఉపాధ్యక్షులు వేముల భాస్కర్‌రావు, ప్రధాన కార్యదర్శి తిప్పరపు బాపురావు, కోశాధికారి బేంకరి కృష్ణాజి సహాయ కార్యదర్శి ఎరుకల రమణయ్యను నూతనంగా ఎన్నుకున్నట్లు సభ్యులు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు లింగంపల్లి తిరుపతి మాట్లాడుతూ, తమపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు అసోసియేషన్ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. మండలంలోని ఫెర్టిలైజర్ వ్యాపారుల సమస్యల పరిష్కారానికి, రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు నూతన కమిటీ ఎల్లవేళలా కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసో సియేషన్ ప్రతినిధులు, ఫర్టిలైజర్ షాపు యజమానులు పాల్గొన్నారు.



## వరకట్న వేధింపుల కేసులో నిందితుడికి జైలుశిక్ష

**ఖమ్మం, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** వరకట్న వేధింపుల కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి 3 సంవత్సరాల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ ఖమ్మం 2వ అదనపు జెఎఫ్సిఎం కోర్టు న్యాయమూర్తి వై. బిందుప్రియ తీర్పు చెప్పారు. ముదిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైం నం.239/2020, సీసీ నెంబర్ .2533/2020, ఐపీసీ సెక్షన్ 498–ఏ, వరకట్న నిషేధ చట్టంలోని సెక్షన్లు 3, 4 కింద కేసు నమోదు చేసిన ఈ కేసులో మదినేని బోసుబాబు, (40 సం) పాత కాచారం గ్రామం, కొణిజర్ల మండలం, ఖమ్మం జిల్లా నివాసి, నిందితుడు–1గా ఉన్నారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో కోర్టు 3 సంవత్సరాల సాధారణ జైలు శిక్ష మరియు రూ.5,000 జరిమానా విధించింది. ఈ కేసులో దర్యాప్తు అధికారిగా అప్పటి ఎస్సై ఎం.డి. మౌలానా, బ్రీఫింగ్ అధికారి ప్రస్తుత ముదిగొండ పోలీస్ స్టేషన్ సిఐ మురళి వ్యవహరించారు. కేసు దర్యాప్తు, కోర్టు విచారణ ప్రక్రియలో ఏపీపి గాయత్రి, సీడీఓ సిహెచ్. శ్రవణ్, ప్రాసెస్ సిబ్బంది లైజన్ అధికారులు కె.శ్రీకాంత్, ఎస్ఐ, హెచ్సి డి. నాగేశ్వరరావు, హోంగార్డ్ ఎం. కాంతారావు లను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

## ఏఎస్సైగా ఉద్యోగన్నతి పొందిన పోలీస్ అధికారులను అభినందించిన సీపీ



**ఖమ్మం, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** వివిధ పోలీస్ స్టేషన్ లలో హెడ్ కానిస్టేబుల్ గా నిరంతరంగా సేవలందించి ఏఎస్సై (అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్) గా ఉద్యోగన్నతి పొందిన (11) పోలీస్ అధికారులు ఎస్డి. జలీల్, జె.రవి, ఎస్కె.ఖాసిం అలీ, కె.వెంకటేశ్వర రావు, కె.చెన్నారావు, ఎస్.శ్రీనివాసరావు, బి.పిచ్చయ్య, జి.హరి, ఎస్.వెంకట కోటిరెడ్డి, ఆర్.కాళ హస్తి, బి.పెద రాజేందర్ లను పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పదోన్నతి చిహ్నాన్ని అలంకరించి, అభినందనలు తెలియజేశారు. పదోన్నతి పొందిన వారు భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్ళనున్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, అసోసియేషన్ అధ్యక్షుడు హేమనాద్ పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు ఆపన్నహస్తం



**ఖమ్మం, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సిఫారసుతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించారు. తిరుమలాయపాలెం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన, అలాగే ఉభయ జిల్లాల్లోని వివిధ మండలాలకు చెందిన మొత్తం 223 మందికి పైగా లబ్ధిదారులకు..రూ.78.17 లక్షల విలువ చేసే చెక్కులను.. రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి కాంగ్రెస్ నేతలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అనారోగ్యంతో వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందడం ఎంతో ఊరటనిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## డీజే యజమానులు బైండోవర్



**చిట్యాల, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** గణేష్ నవరాత్రి మరియు నిమజ్జన ఉత్సవాల సందర్భంగా ప్రజల శాంతిభద్రతలకు భంగం కలగకుండా మరియు శబ్ద కాలుష్యాన్ని అరికట్టేలా చిట్యాల పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా చిట్యాల మండలం పరిధిలో ఉన్న 7 గురు డీజే యజమానులు మరియు ఆపరేటర్లను తహసీల్దార్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట సెక్షన్ 126 బీఎన్ఎస్ఎస్ కింద బైండోవర్ చేసినట్లు చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గౌరవ సుప్రీంకోర్టు మరియు హైకోర్టు ఆదేశాల ప్రకారం అనుమతి లేకుండా అధిక శబ్దంతో కూడిన డీజే సౌండ్ సిస్టమ్స్ లేజర్ లైట్లు మరియు భారీ సౌండ్ ట్రక్కుల వాడకాన్ని పూర్తిగా నిషేధించారు. వీటి వల్ల వృద్ధులకు చిన్నపిల్లలకు మరియు రోగులకు తీవ్ర ఇబ్బంది కలగడంతో పాటు ప్రజా శాంతికి భంగం వాటిల్లే ప్రమాదం ఉందని ఎస్ఐ తెలిపారు. అందులో భాగంగానే ఈ ముందస్తు చర్యలు తీసుకున్నా మని ఆయన వివరించారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమించి అనుమతి లేకుండా డీజేలు ఏర్పాటు చేస్తే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని వెంటనే డీజే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ పోచంపల్లి సతీష్ హెచ్చరించారు. ఉత్సవాలను ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజలు యువత మరియు ఉత్సవ సమితి సభ్యులు పూర్తిగా సహకరించాలని ఆయన కోరారు.





### ప్రభుత్వ ఫలాలు ఎస్సీ, ఎస్టీ వర్గాలకు దామాషా ప్రకారం

# సంపూర్ణంగా అందాలి

### తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల, షెడ్యూల్ తెగల కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

**ఖమ్మం, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** దామాషా ప్రకారం ప్రభుత్వ ఫలాలు సంపూర్ణంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందాలని, ఈ దిశగా అధికారులు కృషి చేయాలని రాష్ట్ర షెడ్యూల్ కులాల, షెడ్యూల్ తెగల కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కమీషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ లతో కలిసి భూమి, సర్వీసెస్, అట్రాసిటీ కేసులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల వారీగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వివరాలు, ఎస్సీ, ఎస్టీ ల కోసం పథకాల అమలు, అట్రాసిటీ కేసుల పురోగతిపై సమీక్షించారు. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీ యువతకు స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించే రాజీవ్ యువ వికాసం కార్యక్రమాన్ని వచ్చే నవంబర్ మాసంలో ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు తెలిపారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అంగన్వాడీ కేంద్రాల భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహించే జనరల్ బాడీ సమావేశాల్లో అంగన్వాడీ భవనాల స్థల సేకరణ, నిర్మాణాల విషయమై చర్యలు వేగవంతం చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు, నాణ్యమైన సౌకర్యాలను కల్పించాలని తెలిపారు. మంగళవారం జరగనున్న హైకోర్టు కమిటీ మీటింగ్ దృష్ట్యా, ఎస్సీ/ఎస్టీ అట్రోసిటీ కేసుల పెండింగ్ బకాయిలు, ఇంటర్–కాస్ట్ మ్యారేజెస్ ప్రోత్సాహకాలు, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని కమిషన్‌కు సమర్పించాలన్నారు. సమీక్షలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... ఏ అంగన్‌వాడీ కేంద్రం ప్రైవేట్ భవనాల్లో ఉండకూడదనే లక్ష్యంతో స్వంత భవనాల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామన్నారు. మహిళల నుంచి వచ్చిన డిమాండ్ మేరకు జిల్లాలో దాదాపు 494 విలేజ్ ఆర్గనైజేషన్ భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగానికి విలువైన సూచనలు, సలహాలు అందించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్‌పర్సన్, సభ్యులకు జిల్లా యంత్రాంగం తరఫున ధన్యవాదాలు తెలిపారు.

సమీక్షల్లో పోలీస్ కమిష నర్ సునీల్ దత్ మాట్లాడుతూ... జిల్లాలో 2017 నుండి ఇప్పటి వరకు 878 ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు అయ్యాయ న్నారు. ఇందులో 194 ఫాల్స్ కేసులు కాగా, 684 కేసుల్లో 653 కేసులకు ఛార్జ్ షీట్ దాఖలు, 8 కేసులకు శిక్షలు పడగా మిగతా కేసులు వివిధ స్థాయిల్లో ఉన్నాయన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా, పరిహారం పొందేలా విచారణ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, శిక్షణ సహాయ కలెక్టర్ పారస్ కుమార్, కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్, కమిటీ అనధికార సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఏసీపీలు, ఎంపిడిఓలు తదితరులున్నారు.

## నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులను వేగవంతం చేయాలి

### నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర మంత్రులు, సీఎస్

**ఖమ్మం, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్అండ్ఆర్ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, అటవీ భూముల పరిహారం, పునరావాసం--పునరావాస పునరుద్ధరణ (ఆర్అండ్ఆర్) పనుల పురోగతిపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్అండ్ఆర్ పనులకు అవసరమైన నిధులను పూర్తిస్థాయిలో విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని తెలిపారు. నీటిపారుదల శాఖకు కేటాయించిన నిధులకు అదనంగా ఇతర వనరుల నుంచి నిధులను బదిలీ చేసి అవసరమైన మేరకు నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.





2026--27 ఆర్థిక సంవత్సరంలో భూసేకరణకు మొత్తం రూ.6 వేల కోట్ల వరకు నిధులు విడుదల చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే రూ.1,050 కోట్లు, మరోసారి రూ.1,500 కోట్లు కలిపి మొత్తం రూ.2,550 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. విడుదలైన నిధుల్లో అధిక భాగం ఇప్పటికీ అధికారుల ఖాతాల్లోనే ఉండి, లబ్ధిదారులకు చేరకపోవడం ఆందోళనకరమని అన్నారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... ఇప్పటికే అవార్డులు జారీ చేసిన భూములకు సంబంధించిన పరిహారం చెల్లింపులను మొదటి ప్రాధాన్యతగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అవార్డు జారీ చేసిన తరువాత కూడా చాలా కాలం పరిహారం అందకపోతే ప్రజల్లో అసంతృప్తి పెరిగి, అధిక పరిహారం కోసం డిమాండ్లు పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. నీటిపారుదల ప్రాజెక్టుల పెండింగ్ భూసేకరణపై ప్రతి వారం సమీక్ష నిర్వహించి, పనులను వేగవంతం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ... ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులకు సంబంధించి సుమారు రూ.3,100 కోట్ల విలువైన పనులు గుర్తించగా, రూ.2,514 కోట్ల మేర నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. పరిహారం నేరుగా రైతులకు చేరేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకుని భూసేకరణ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఇరిగేషన్ సిఈ వాసంతి, డిసిఎస్ఓ చందన్ కుమార్, ఇరిగేషన్ ఈఈ లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్‌లో అడిషనల్ ఎస్పీ ఆకస్మిక తనిఖీ



**గణపురం, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా అందించడమే లక్ష్యంగా జిల్లా అడిషనల్ ఎస్పీ నరేష్‌కుమార్ సోమవారం గణపురం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమైన ఆయన శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని, నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని ఎస్ఐ అశోక్‌ను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.

## భక్తిశ్రద్ధలతో గణనాథుడికి పూజలు



**గణపురం, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండల కేంద్రంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. హనుమాన్ కాలనీలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కొలువు దీరిన లంబోదరుడికి సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎస్ఆర్ మాట్లాడుతూ కాలనీవాసులు ఐక్యమత్యంతో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అంతకుముందు విగ్రహ దాత, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బోనాల రాజమౌళి ఉమాదేవి దంపతులు గణనాథుడికి శాస్త్రోక్తంగా విశేష పూజలు జరిపించారు. అనంతరం వారి కుమారుడు బోనాల ప్రబోధన్ అనులేఖ దంపతుల సౌజన్యంతో భక్తులకు ఏర్పాటు చేసిన మహా అన్నప్రసాద వితరణను స్థానిక సర్పంచ్ కట్కూరి రాధికా శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఓరుగంటి కృష్ణ, మాజీ జెడ్పిటిసి మోటపోతుల శివశంకర్ గౌడ్, నాయకులు దూడపాక శంకర్, గుజ్జ గంగాధర్ రావు, విడిదినేని అశోక్, చోటే మియా, దూలం కుమారస్వామి, గంధం ఓధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**చిట్యాల, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని జూకల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 1979--80 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరగాని కృష్ణ అధ్యక్షతన సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు గిరగాని కృష్ణ మాట్లాడుతూ 46 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా తాము చదువుకున్న పాఠశాలకు కుటుంబ సమేతంగా తరలివచ్చి నాటి గురువులను సత్కరించుకోవడం చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకోవడం ఎంతో అభినందనీయమన్నారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పాఠశాలకు ప్రస్తుత విద్యార్థులకు స్ఫూర్తినిచ్చేలా ఉందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ ఎలగొండ సంధ్యారాణి ఉప సర్పంచ్ అమీర్ సోహేల్ హాజరయ్యారు. 46 ఏళ్ల తర్వాత తాము చదువుకున్న బడిని చూసి నాటి స్నేహితులను కలుసుకోవడంతో పూర్వ విద్యార్థులు తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ పలువురి కళ్లల్లో ఆనందభాష్పాలు కనిపించాయి. పూర్వ విద్యార్థులు తమ జీవిత భాగస్వాములతో కలిసి కార్యక్రమానికి హాజరై తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు రాజయ్య పగడాల అయిలయ్య బండి రాజమౌళి రామ్‌మోహన్‌ను ఘనంగా సన్మానించారు. పూలమాలలు వేసి గురువులకు పాదాభివందనాలు చేసి తమ గురుభక్తిని చాటుకున్నారు. ఇంతటి సీనియర్ పూర్వ విద్యార్థులు తమ గురువులను ఈ విధంగా గౌరవించడం నేటి తరానికి ఆదర్శప్రాయమని పలువురు కొనియాడారు. అదేవిధంగా పూర్వ విద్యార్థుల్లో ఉపాధ్యాయ వృత్తిలో సేవలందించి పదవీ విరమణ పొందిన విరగంటి రవీందర్ ను కూడా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెల్దండి రవీందర్ మాట్లాడుతూ పాఠశాల పరిశుభ్రతపై ప్రధానోపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పాఠశాల పరిశుభ్రత అవసరమైన సౌకర్యాల కోసం దాతల సహకారం తీసుకునేందుకు చర్యలు చేపడతామని ప్రధానోపాధ్యాయులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మ్యాదరి సునీల్ మాట్లాడుతూ తన సాహిత్య రచనలు సామాజిక సేవలను గుర్తించి గురు సమానులు గ్రామ ప్రముఖుల సమక్షంలో సన్మానం పొందడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తనను ప్రోత్సహిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వారి కుటుంబ సభ్యులు ఉపాధ్యాయులు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ మాహ్




**గణపురం, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండలంలోని చెల్పూర్ గ్రామ పరిధిలోని దుబ్బపల్లి అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడి టీచర్ గాజుల శోభ ఆధ్వర్యంలో పోషణ్ మాహ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, తల్లులు, లబ్ధిదారులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు, పప్పులు, ఆకుకూరలు, చేపలు, కాలాను గుణంగా లభించే పండ్లు తదితర అన్ని రకాల పోషకాహారాన్ని ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. పిల్లలకు జంక్‌ఫుడ్ ఇవ్వకుండా ఇంట్లో తయారు చేసిన పరిశుభ్రమైన, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు ప్రతిరోజూ తాజాగా, వేడిగా వండిన ఆహారం మెనూ, అందులో ఉండే పోషక విలువల గురించి వివరించారు. అనంతరం పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, కిషోర బాలికలు పిల్లలు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com

# సర్కార్ అనవసర రాజకీయాలు...


- ఒకవైపు ప్రకృతి పగ... మరోవైపు కరెంటు కోతలు
- అనవసర రాజకీయాలు చేస్తున్న సర్కార్
- నిత్యం ప్రతిపక్షాలను నిందిస్తూ ప్రెస్‌మీట్ల లొల్లి
- సమస్యలను గాలికి వదిలి పాలకుల నిర్లక్ష్యం
- నిరసనలు వ్యక్తంచేస్తున్న రైతన్నలు
- సొంత పార్టీ నేతలే స్తంభం ఎక్కి ఆందోళన...

పీపుల్స్‌డైరీ–స్టేట్‌బ్యూరో : తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం రైతాంగం తీవ్ర క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది. ప్రకృతి వైపరీత్యం ఒకవైపు.. విద్యుత్ కొరత మరోవైపు.. పాలనను గాలికి వదిలేసిన ప్రభుత్వ తీరు మరోవైపు రైతును కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో రైతును ఆదుకోవాల్సిన ప్రభుత్వం.. రాజకీయ లబ్ధి కోసం కేసీఆర్ అసైన్డ్ భూముల పేరుతో.. గంటల కొద్దీ ప్రెస్ మీట్ల పేరుతో కాలం వెళ్లదీస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రాష్ట్రంలో ఈ ఏడాది సూపర్ ఎల్నినో ప్రభావం తీవ్రంగా ఉంది. 33 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉన్నాయి. దాదాపు 400 మండలాల్లో కరువు లాంటి పరిస్థితి నెలకొందని అధికారిక నివేదికలే స్పష్టం చేస్తున్నాయి. గత ఏడాది ఇదే సమయానికి రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో 585 టీఎంసీల నీరు అందుబాటులో ఉండగా.. ఈ ఏడాది కేవలం 241 టీఎంసీలు మాత్రమే మిగిలింది. అంటే ఏకంగా 344 టీఎంసీల నీరు మాయమైంది. రాష్ట్రంలోని 44,034 చెరువుల్లో 40 శాతం చెరువులు కనీసం పావు వంతు కూడా నిండలేదు. దీని ప్రభావంతో ఖరీఫ్ సాగు విస్తీర్ణం 38 శాతానికి పడిపోగా.. ప్రధానమైన వరి సాగు కేవలం 6.4 శాతానికి పరిమితమైంది.

**కరెంటు దెబ్బ - కోతలతో రైతు విలవిల..**

వర్షాలు లేకపోవడంతో రైతులు పూర్తిగా బోరుబావులపై ఆధారపడ్డారు. దీంతో వ్యవసాయ విద్యుత్ డిమాండ్ ఒక్కసారిగా 6,500 నుంచి 7,000 మెగావాట్లకు చేరుకుంది. సాధారణ వర్షాకాలంలో 11,000 మెగావాట్లుగా ఉండే రాష్ట్ర మొత్తం విద్యుత్ డిమాండ్.. ఈ ఏడాది 17,085 మెగావాట్లకు చేరి చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరుకుంది. జలాశయాల్లో నీటి కొరత కారణంగా దాదాపు 2,000 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది.అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ప్రభుత్వం నిరంతరాయ విద్యుత్ సరఫరా చేస్తున్నామని ప్రకటిస్తున్నప్పటికీ.. రైతులకు కేవలం 6 నుంచి 7 గంటలు మాత్రమే విద్యుత్




అందుతోందని.. అది కూడా తక్కువ వోల్టేజీతో, గంట గంటకు కోతలతో అందుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దీంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులు సబ్ స్టేషన్లను ముట్టడించి ఆందోళనలు చేస్తున్నారు. కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు, నీటి ట్యాంకులు ఎక్కి ధర్నాలు చేసిన ఘటనలు కూడా వెలుగు చూశాయి. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఈ ధర్నాల్లో అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొంటున్నారు. "మాకు పార్టీ కంటే పంటే ముఖ్యం" అంటూ వారు నినాదాలు చేయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనంగా మారింది.

**పాలన వదిలి.. అనవసర రాజకీయాలు...**

ప్రతిపక్షాలు విమర్శిస్తూనే ఉంటాయి. ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలను ఎత్తి చూపుతూనే ఉంటాయి. అది ప్రజాస్వామ్యంలో సహజం.కానీ ఇక్కడ జరుగుతున్నది వేరు. అధికారంలో ఉన్న నాయకులు.. సీఎంతో సహా కొందరు మంత్రులు పాలనను పూర్తిగా వదిలేసి.. గంటల కొద్దీ ప్రెస్ మీట్లు పెట్టి.. ప్రతిపక్షాలను తిట్టడమే పనిగా పెట్టుకుంటున్నారు. రోజూ మూడు, నాలుగు గంటల పాటు ప్రెస్ మీట్లు.. అందులో కేసీఆర్ అసైన్డ్ భూములు.. 22–ఏ నిషేధిత జాబితా భూములు.. అంటూ ఒకరిపై ఒకరు బురద చల్లుకోవడమే సరిపోతోంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితిలో రైతుల గురించి ఆలోచన చేయకుండా.. రాజకీయ లబ్ధి కోసం కేసీఆర్ అసైన్డ్ భూములు అని ప్రెస్ మీట్లతో కాలం వెళ్లదీస్తున్నారు. ప్రతిపక్షాలపై పెట్టే శ్రద్ధలో కనీసం పదోవంతు పాలనపై.. ప్రజలపై పెడితే బాగుంటుందని సామాజికవేత్తలు హితవు పలుకుతున్నారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా.. ఇన్ని రోజులు కేసీఆర్ కుటుంబంపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా.. ఇప్పుడు రైతు కష్టకాలంలో ఉండగా.. వాతావరణం అనుకూలించక, విద్యుత్ కోతలతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్న సమయంలో.. రైతులకు ఎలాంటి సహాయం చేయాలనే ఆలోచన చేయకుండా.. రాజకీయ లబ్ధి కోసం ఇలా భూముల పేరుతో ప్రెస్ మీట్లు పెట్టి కాలం వెళ్లదీయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు.రైతుకు ఇప్పుడు కావాల్సింది అసైన్డ్ భూముల లెక్కలు కాదు.. తన బోరుకు వచ్చే కరెంటు లెక్క.. ఎండిన పంటకు అందే భరోసా లెక్క. పాలకులు ప్రెస్ మీట్లను పక్కనపెట్టి.. పొలం బాట పడితేనే రైతుకు న్యాయం జరుగుతుంది. లేదంటే.. రైతు ఆగ్రహం ఓటు రూపంలో బయటపడటం ఖాయం.

# రుద్రమ వైపే చూపు...

- వరంగల్ ఎయిర్‌పోర్ట్ పేరు కోసం ప్రజలు, మేధావుల సూచనలు
- 'కాకతీయ'కు సైతం మద్దతు
- చరిత్ర ప్రతిబింబించాలంటూ మెజార్టీ ప్రజల అభిప్రాయం
- విమానాశ్రయం పేరుపై సోషల్ మీడియాలో చర్చ




పీపుల్స్‌డైరీ–హనుమకొండ : వరంగల్ మామునూరు విమానాశ్రయం ఏర్పాటుకు చర్యలు కీలక దశకు చేరుకుంటున్న వేళ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మామునూరు ఎయిర్ పోర్టుకు ఏ పేరు పెడితే బాగుంటుందని సూచన చేయాలని ప్రజలను కోరారు. దీంతో ప్రజల నుంచి ముఖ్యంగా ఓరుగల్లు వాసులు అనేక పేర్లతో సూచనలు చేస్తున్నారు. వరంగల్‌లోని మామునూరు విమానాశ్రయానికి చాలా మంది రాణి రుద్రమదేవి పేరుతో ఎయిర్‌పోర్ట్ పెట్టాలని సూచిస్తున్నారు. వరంగల్‌కు చెందిన భద్రకాళి అమ్మవారి పేరుతో 'భద్రకాళి విమానాశ్రయం' అని కోరేవారు కూడా ఎక్కువే ఉన్నారు. కాకతీయ రాజుల పాలనను గుర్తు చేసేలా 'కాకతీయ ఎయిర్‌పోర్ట్' అనే పేరు కూడా బాగుంటుందని చెప్పన్న వారు లేకపోలేదు.

ఏకశిల, ప్రతాపరుద్ర, సమ్మక్క–సారలమ్మ, జయశంకర్, కాళోజీ నారాయణరావు, చాకలి ఐలమ్మ వంటి పేర్లు కూడా పలువురు సూచన చేస్తున్నారు. ఇప్పటికే దర్శకుడు సందీప్ రెడ్డి వంగా రుద్రమ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్, కాకతీయ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ అని రెండు పేర్లు సూచించారు. కొందరు విమానాశ్రయం లోగో నమూనాలను కూడా రూపొందించి పోస్ట్ చేస్తున్నారు. నెటిజన్లలో మెజారిటీ ప్రజలు రాణి రుద్రమదేవి పేరును సూచించటం కనిపిస్తుంది. ఇది వరంగల్ చరిత్ర, సంస్కృతి, స్థానిక గుర్తింపును, కాకతీయుల వీరత్వాన్ని ప్రతిబింబించేలా పేరు పెట్టాలనే స్థానికుల ఉత్సాహానికి ప్రతీకగా నిలుస్తుంది. ఆ తర్వాత స్థానంలో కాకతీయ నిలిచింది. ఇదిలా ఉంటే మామునూరు విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించి చేపడుతున్న చర్యలలో మూడు ప్యాకేజీలుగా నిర్మాణ పనులను చేపట్టడానికి ఎయిర్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే రెండు ప్యాకేజీల పనులకు వేర్వేరుగా టెండర్లు పిలిచి ప్రక్రియను పూర్తి చేసింది. విమానాశ్రయ నిర్మాణాలు జరిగే ప్రాంగణం 953 ఎకరాల చుట్టూ ప్రహరీ నిర్మాణం తొలి ప్యాకేజీలో చేపట్టనున్నారు.

రన్ వే, ఆవరణలో పార్కింగ్, సీవరేజ్ వ్యవస్థ నిర్మాణ పనులను రెండవ ప్యాకేజీలో ప్రతిపాదించారు. ఇక ఆఖరి ప్యాకేజీ పనులను టెర్మినల్ భవనం, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్, ఫైర్ స్టేషన్, విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణాలను 213. 59 కోట్ల రూపాయలతో చేపట్టనున్నారు. ఈ పనులకు సంబంధించి తాజాగా టెండర్లు పిలిచి నవంబర్ నాటికి పూర్తయ్యేలా కార్యాచరణను సిద్ధం చేశారు. ఎయిర్పోర్ట్ నిర్మాణానికి సంబంధించి డిసెంబర్లో శంకుస్థాపన చేయనున్నట్టు సమాచారం.

# టార్గెట్ కడియం...

- పార్టీ మారిన వారిపై వెనక్కి తగ్గొద్దని డిసైడ్
- నెక్స్ట్ స్టెప్‌పై కేసీఆర్ అలర్ట్
- దానంపై వేటుతో గులాబీలో ధీమా....



పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ కు దగ్గరైన ఎమ్మెల్యే వ్యవహారంలో కొత్త లెక్కలు తెర మీదకు వస్తున్నాయి. వారిలో దానం నాగేందర్ పైన తాజాగా హైకోర్టు అనర్హత వేటు వేసింది. ఈ తీర్పు పైన దానం సుప్రీం ను ఆశ్రయించారు. బుధవారం ఈ కేసు విచారణ జరగనుంది. హైకోర్టు తీర్పుతో ఖైరతాబాద్ కు ఉప ఎన్నిక ఖాయమనే చర్చ సాగుతోంది. ఇదే సమయంలో దానం తరువాతి వికెట్ ఎవరనే అంశం అటు బీఆర్ఎస్.. ఇటు కాంగ్రెస్ లోనూ ఆసక్తిగా మారుతోంది. అయితే.. దానం తరహాలో పూర్తి ఆధారాలతో కడియం శ్రీహరిని టార్గెట్ చేయాలని బీఆర్ఎస్ భావిస్తోంది. కడియం శ్రీహరి మీద బీఆర్ఎస్ వేసిన పిటీషన్ త్వరలోనే విచారణకు వస్తుందని చెబుతున్నారు. 2024 ఎన్నికల్లో వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థిగా తన కూతురు కడియం కావ్య పోటీ చేయడం, అందులో నామినేషన్ పత్రాల మీద కడియం శ్రీహరి సంతకాలు చేయడమే కాకుండా కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారని గులాబీ పార్టీ నేతలు గుర్తు చేస్తున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయాలని కోరిన అంశాలను బీఆర్ఎస్ ప్రధానంగా కోర్టులో విచారణ సమయంలో ప్రస్తావించాలని డిసైడ్ అయింది. తమ కుమార్తె కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన సమయంలో ఆ పార్టీకి మద్దతుగా ప్రచారం చేసిన ఆధారాలతో కడియం పైన అనర్హత వేటు పడుతుందని గులాబీ పార్టీ నేతలు ధీమాగా చెబుతున్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు అందరికీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ క్లీన్ చిట్ ఇచ్చినప్పటికీ తాజాగా హైకోర్టు దానం నాగేందర్ పైన అనర్హత వేలు వేసింది. అదే విధంగా కడియం తో పాటుగా మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డికి కూడా ఇబ్బందులు తప్పవని తెలుస్తుంది. ఆయనను ప్రభుత్వ సలహాదారుగా నియమించడమే కాకుండా, సహాయ మంత్రి హోదా ఇవ్వడం ఆయనకు న్యాయ పరంగా ఇబ్బందిగా మారుతుంది అని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. దీంతో.. ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ మారిన వారి పైన న్యాయ పరంగా పోరాటం కొనసాగించాలని డిసైడ్ కావటంతో వీరి విషయంలో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయనేది ఉత్కంఠగా మారుతోంది.

# రుద్రమ నగర్‌లో కూచిపూడి నృత్యాలు



వరంగల్, సెప్టెంబర్ 21 (పీపుల్స్‌డైరీ) : వరంగల్ నగరం రంగసాయిపేటలోని రుద్రమ నగర్ గణేష్ ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో సోమవారం రోజున ఎన్.సి.ఎన్ కళాక్షేత్రం బృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రుద్రమ నగర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు అందరూ కలిసి విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం చేశారు. కార్యక్రమంలో నాట్య గురువు కొనతం వెంకటేశ్వర్లు నాట్య ప్రదర్శన చేసిన విద్యార్థులు దొంతురాల సాన్వి, పొలిపాక లక్ష్మి స్నిగ్ధ, పంజల హాసిని, రామ భవిశ్య పరకాల చైత్ర, పసుపులేటి కాత్యాయాని, అలిజిపుర్ సన్మహి, పాటి శ్రీసంహిత, గుండ శ్రీనిధి, జన్ను దివ్య, ధూమపటి సాన్వి, సంయుక్త, రుద్రమ నగర్ గణపతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు పసుపులేటి హనుమంతరావు, కర్ణ వేణుగోపాల్, కొంగరి లక్ష్మీనారాయణ, బత్తుల సుదర్శన్,కొంతం వెంకన్న, బోడ కృష్ణ, మట్టపల్లి దేవేందర్, ఆకుల మహేందర్, రాచమల్ల రాజేష్, సతీష్,పసుపులేటి పూర్ణచందర్, గుండు దిలీప్ కుమార్, పోగుల సుతేజ్, సిద్దార్థ, కుశాల్,రాజ్ కుమార్,బోగోజు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ అవార్డు గ్రహీత కు సన్మానం



వరంగల్, సెప్టెంబర్ 21 (పీపుల్స్‌డైరీ) : వరంగల్ జిల్లా ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మహమ్మద్ మహబూబ్ పాషాను సోమవారం ఉరుసు ప్రాంతానికి చెందిన చిన్ననాటి స్నేహితులు శాలువాతో సన్మానం చేసి స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అవార్డు గ్రహీత మహబూబ్ జెడ్ పి హెచ్ ఎస్ స్కూల్ కొంగపాక పాఠశాలలో పనిచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అర్బన్ కాంగ్రెస్ నాయకుడు గడ్డం యుగంధర్ గౌడ్, ఆడపు అనిల్ కుమార్, మహమ్మద్ నబి రిటైర్డ్ ఆర్మీ వనపర్తి నాగరాజు తదితరులు పాల్గొన్నారు

# అనాధ మానసిక వికలాంగులకు అన్నదానం



**పీపుల్స్‌డైరీ–వరంగల్ :** కరీమాబాద్ అశోక వీధి ప్రాంతంలో శ్రీ గరిక యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం అనాధలకు,మానసిక వికలాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ గౌరవాధ్యక్షుడు మంద నాగరాజు, ఉపాధ్యక్షుడు గద్దమీది సురేష్ లు మాట్లాడుతూ గణేష్ నవరాత్రుల సందర్భంగా అనాధలకు మానసిక వికలాంగులకు అన్నదానం చేసే అవకాశం రావడం ఎన్నో జన్మల పుణ్యమని తెలిపారు. హనుమకొండలోని ఒక ప్రముఖ పాఠశాల నుండి ఈ విద్యార్థులను తీసుకువచ్చామని ఆకలితో ఉన్నవారికి అన్నదాన ప్రసాదవితరణ చేయాలని పిలుపునిచ్చారు. అన్నదానానికి సహకరించిన భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు కార్యక్రమంలో కమిటీ సభ్యులు సార్థక్, అక్షిత్ సాయి, వరుణ్, అభిరామ్,మహిళా భక్తులు శోభారాణి ,రాజ్యలక్ష్మి, రజిత సాంబలక్ష్మి, పద్మావతి, తులసి గీతిక ,తేజస్విని ,శాన్విత ,సరోజన భక్తులు పాల్గొన్నారు.






# మామునూర్ 4వ బెటాలియన్‌లో ఘనంగా వినాయక నవరాత్రి పూజలు

## అన్న ప్రసాద వితరణ

**పీపుల్స్‌డైరీ–వరంగల్ :** మామునూర్ లోని 4వ బెటాలియన్‌లో వినాయక నవరాత్రుల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం బెటాలియన్ ఆవరణలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని అత్యంత శ్రద్ధాసక్తులతో నిర్వహించారు. ఉదయం బెటాలియన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద కుంకుమ పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో బెటాలియన్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం విఘ్నేశ్వరునికి కమాండెంట్ ఎన్.వి.ఎస్ శ్రీనివాస్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించన తర్వాత సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు మరియు భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కమాండెంట్ స్వయంగా భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించడం విశేషం. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ జె. రాజేందర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్స్ కార్తీక్, రవి, రాజ్ కుమార్, రాంప్రసాద్, ఉన్నతాధికారులు, సిబ్బంది మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు





# ఖమ్మంలో రాజ్యాధికార పార్టీకి నూతన కార్యవర్గం

**బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమ నిధులు పూర్తిగా వారికే ఖర్చు చేయాలి: గట్ల రాజన్న**

ఖమ్మం, సెప్టెంబర్ 21 (పీపుల్స్ డైరీ) : తెలంగాణ రాజ్యాధికార పార్టీని ఖమ్మం జిల్లాలో క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కార్యాచరణ ప్రారంభించినట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి గట్ల రాజన్న తెలిపారు. ఖమ్మం జిల్లా అధ్యక్షులు దామల్ల సత్యం ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మం నగరంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గట్ల రాజన్న ముఖ్య అతిథిగా హాజరై పార్టీ నిర్మాణం, ప్రజా సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు.

–పలువురికి పార్టీ పదవులు

ఖమ్మం జిల్లాలో పార్టీని మరింత విస్తృతం చేసే లక్ష్యంతో నూతన బాధ్యతలను ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా పెరమాలపల్లి నాగార్జున, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శిగా పోలూరి వినయ్, ఖమ్మం జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా తెల్లాపుట్ట జగపతి బాబు, జిల్లా యువజన విభాగం జనరల్ సెక్రటరీగా తెల్లూరి జితేందర్, ఖమ్మం నగర అధ్యక్షుడిగా కొప్పుల రామారావు, డివిజన్ కార్యదర్శులుగా రామకృష్ణ, రాజులను నియమిస్తూ సాధరంగా ఆహ్వానించి, అభినందించి పార్టీ కండువాను కప్పి బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా గట్ల రాజన్న ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, నూతనంగా నియమితులైన బాధ్యులు, యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.



# ట్రై సిటీలో ఘనంగా గణేష్ శరన్నవరాత్రి ఉత్సవాలు

- పెద్ద ఎత్తున అన్న ప్రసాద వితరణలు
- కుంకుమార్చనలు... వివిధ రకాల నైవేద్యాలు
- ప్రత్యేక పూజలతో గణేష్ శరన్నవరాత్రి ఉత్సవాలు

కాశిబుగ్గ, సెప్టెంబర్ 21 ( పీపుల్స్ డైరీ ) : వరంగల్, హనుమకొండ, కాజీపేటలోని వివిధ ప్రాంతాల్లో గణేష్ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం గణేశుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ తమ భక్తి ప్రపత్తిని చాటుకుంటున్నారు. వరంగల్ లోని కాశిబుగ్గ, గిర్మాజీపేట, పోచమ్మ మైదాన్, ఎల్లం బజార్, రైల్వే గేట్, కరీమాబాద్, ఎస్ ఆర్ ఆర్ తోట, లక్ష్మీపురం, ఎనమామల మార్కెట్, లేబర్ కాలనీ, హన్మకొండ లోని రాగన్న దర్వాజ, రెడ్డి కాలనీ, గోపాల్ పూర్, నయీమ్ నగర్, నక్కల గుట్ట, అదాలత్ సెంటర్, కాజీపేట, డీజిల్ కాలనీ, బాపూజీ నగర్, విష్టపురి కాలనీ, దర్గా కాజీపేట మహిళలు కుంకుమ పూజలు నిర్వహి స్తున్నారు. గణేష్ మండపాల వద్ద భక్తులు సాయంత్రం నుండి రాత్రి వరకు పెద్ద ఎత్తున వినాయకులను దర్శించు కుంటున్నారు.

**కాశిబుగ్గలోని వివిధ ప్రాంతాల్లో ఘనంగా అన్నప్రసాద వితరణలు**

కాశిబుగ్గలోని 19, 20 డివిజన్ లోని వివిధ ప్రాంతాల్లో గణేష్ మండ పాల వద్ద ఆదివారం పెద్ద ఎత్తున అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. పద్మ నగర్, కాశిబుగ్గ జంక్షన్, మార్కండేయ గుడి వద్ద, కాశిబుగ్గ గ్రంథాలయం, తిలక్ రోడ్డు తదితర ప్రాంతాల్లో అన్న ప్రసాద వితరణలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆదివారం కావడంతో అన్న ప్రసాద వితరణలు ఒకరికొకరు పోటీపడి నిర్వహిస్తున్నట్లుగా కొట్టొచ్చినట్లు కనిపించింది.



హనుమకొండ లష్కర్ బజార్‌లోని 6వ డివిజన్‌లో శ్రీ వరసిద్ధి గజాన మండలి ఆధ్వర్యంలో...



కరీమాబాద్ కాశీకుంట వద్ద ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...



హనుమకొండ లష్కర్ బజార్‌లోని కమ్మరివాడలో ఏర్పాటు చేసిన గణనాథుడు



కాశిబుగ్గలోని శ్రీ భక్త మార్కండేయ దేవాలయం పక్కన న్యూ కళాంజలి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...



జేపీఎన్ రోడ్ లోని విశ్వకర్మ వీధిలో స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో...



బీట్ బజార్‌లోని లాల్చి దొడ్డిలో భద్రకాళి సొసైటీ కాలనీ ఆధ్వర్యంలో...

కాశిబుగ్గ దేవాలయం మెయిన్ రోడ్డు ఆర్చి పక్కన సిరిమల్ల సోమయ్య పరపతి సంఘం ఆధ్వర్యంలో...



వరంగల్ లో







ఉర్సులోని సుభాష్ నగర్ సీకేఎం ప్రసూతి హాస్పిటల్ ఎదురుగా సుభాష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...